

నెల్లూరులో హెల్మెట్లు ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు


● హెల్మెట్‌తోనే సురక్షితం

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని ప్రజలకు అవగాహన కల్పిస్తూ సోమవారం నెల్లూరు, కావలి, సంగంలలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు జరిగిన ర్యాలీని ఏఆర్ అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య ప్రారంభించారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రయాణించాలని అధికారులు సూచించారు. రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించి క్షేమంగా గమ్యాన్ని చేరాలని ఆకాంక్షించారు.

వైద్యసేవలు మెరుగుపరుస్తా

● నూతన డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వైద్యసేవలను మెరుగుపరచనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా 1997లో తొలిగా విధుల్లో చేరారు. తర్వాత 2012లో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొందారు. 2022లో అదే జిల్లా ఆత్మకూరు రూరల్ హెల్త్ సెంటర్ డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం పదోన్నతిపై డీఎంహెచ్‌వోగా నెల్లూరుకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సుజాత మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య పథకాలు ప్రజలకు చేరువ చేసేలా కృషి చేస్తానని చెప్పారు. కాగా, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని డీఎంహెచ్‌వో మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, ఇక్కడున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య రంపచోడవరం అదనపు డీఎంహెచ్‌గా డీ ప్రమోషన్‌పై బదిలీ అయిన విషయం తెలిసిందే.







● హైస్కూళ్లలో ఇంటర్ బోధన అభాసుపాలు ● నాటి వైసీపీ సర్కారు అనాలోచిత నిర్ణయం
● అధ్యాపకులు లేరు.. వసతులూ కరువే ● పడిపోయిన ఉత్తీర్ణతా శాతం
● దిద్దుబాటు చర్యల్లో కూటమి ప్రభుత్వం ● వచ్చే విద్యాసంవత్సరం నుంచి మూత?
● అన్ని వసతులతో మండలానికో జూనియర్ కాలేజి

ప్లస్‌తో లాసే

సకాలంలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడం, విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయకపోవడం వంటి విధానాలతో ప్రభుత్వ విద్యాసంస్థలన్నీ జగన్ సర్కార్ దెబ్బకు నిర్వీర్యమైపోయాయి. ధ్వంస రచనే తప్ప దార్శనికత తెలియకుండా తీసుకున్న నిర్ణయాలతో విద్యారంగం మరింత దిగజారడంపై తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమైంది. ఇందులో భాగంగానే నాటి సర్కారు ప్రారంభించిన జడ్పీ జూనియర్ కళాశాలలు (హైస్కూల్ ప్లస్) అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. చేదు అనుభవాల నుంచి తేరుకున్న విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టినా క్షేత్రస్థాయిలో స్పందన మాత్రం లభించడం లేదు. పాఠ్యపుస్తకాలు లేకుండా, అనుభవజ్ఞులైన అధ్యాపకులు లేకుండానే తరగతులు నిర్వహించారన్న విమర్శలున్నాయి. ఉత్తీర్ణత ఫలితాలు కూడా అంతంతమాత్రంగానే ఉండటంతో రానున్న విద్యాసంవత్సరం నుంచి వీటిని మూసివేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులో వేస్తోంది.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

ఓట్ల యావతో వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, గొప్పల కోసం అమలు చేసిన అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులు ఇప్పుడు తిప్పలు పడుతున్నారు. మేనమామను అంటూ డాబులు పలికిన జగన్ బాలికా విద్యను ప్రోత్సహించడం కోసమంటూ ఎక్కువ ఎన్‌రోల్‌మెంట్ కలిగిన ఉన్నత పాఠశాలల్లో ఇంటర్ కోర్సులు ప్రవేశపెట్టారు. ఎక్కడైతే పదోతరగతి పూర్తి చేశారో అక్కడే అందుబాటులోకి వచ్చిన జూనియర్ ఇంటర్‌లో విద్యార్థులు చేరాలని ఆదేశించారు. దీంతో జిల్లాలో 23 ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు ఇంటర్ తరగతులు ప్రారంభించారు. పదో తరగతిలో ఎక్కువ మంది బాలికలున్న ఉన్నత పాఠశాలలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపులను ఎంపిక చేసుకుని ప్రవేశాలు చేపట్టారు. వీటిలో 13 హైస్కూల్ ప్లస్ మాత్రం కేవలం బాలికల పాఠశాలల్లో ఏర్పాటు చేయగా మిగిలిన 10 హైస్కూల్ ప్లస్‌లో మాత్రం కోఎడ్యుకేషన్ పాఠశాలల్లో అమలు చేశారు. అయితే రోజులు గడిచే కొద్దీ సమస్యలు ప్రారంభమయ్యాయి. ఎలాంటి వసతులు, బోధన లేకుండా ఇంటర్ జరుగుతుండటంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ కొంతమంది తమ పిల్లలను ఇతర కళాశాలల్లో చేర్పించారు. మరికొంతమంది ప్రత్యామ్నాయం లేక తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడే కొనసాగించడంతో ఫలితాలు పూర్తిగా పడిపోయాయి.

● అధ్యాపకులు లేకుండానే బోధన

ఉన్నత పాఠశాలలు జూనియర్ కళాశాలలుగా మార్పు చేయడం కాగితాలకే పరిమితమైంది. ఒక్క కళాశాలలో కూడా అధ్యాపకుల నియామకాలు చేపట్టలేదు. గడిచిన సంవత్సరాల్లో పుస్తకాలు, అధ్యాకులు, ప్రాక్టికల్స్ ఏమీ లేకుండానే పరీక్షలకు విద్యార్థినులు హాజరయ్యారు. హైస్కూళ్లలో టీచర్లుగా పనిచేస్తూ పీజీలు పూర్తిచేసిన ఉపాధ్యాయుల్లో కొందరిని బోధనకు నియమించినా మొక్కుబడిగానే తరగతుల నిర్వహణ జరిగినట్లు తల్లిదండ్రులు తెలిపారు. అత్యధిక కళాశాలల్లో ఈ బోధనలు కూడా జరగకపోవడంతో ఉత్తీర్ణతశాతం పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో బోధన చేసేందుకు సబ్జెక్ట్ వారీగా 148 పోస్టులను పాఠశాల విద్యాశాఖ మంజూరు చేసింది. జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ కేడర్ సబ్జెక్ట్ టీచర్లతో భర్తీ చేయాలని ఆదేశాలిచ్చింది. ఆసక్తి ఉన్న ఎస్ఏల నుంచి ఆప్షన్‌లు తీసుకోవాలని, వీరికి ఆర్థిక ప్రయోజనంగా ఒక ఇంక్రిమెంట్‌ను ఇచ్చేలా ఒప్పందం చేసుకోవాలని తెలిపింది. అయితే, తొలుత అతి కొద్ది మంది మాత్రమే దరఖాస్తు చేసుకోగా, అధికారులు నచ్చచెప్పి పీజీ అర్హత కలిగిన ఎస్ఏలను ఒప్పించి 111 పోస్టులను భర్తీ చేయగా ఇంకా 37 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

జూనియర్ కళాశాలలుగా మార్పు

హైస్కూల్ ప్లస్ విద్యాలయాలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇటీవల నిర్వహించిన సమీక్షలో కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు, వెతలను గుర్తించి రానున్న విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ ప్లస్‌లను రద్దు చేసి వాటి స్థానంలో అన్ని వసతులతో మండలానికి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో అధికారులు ఆ దిశగా చర్యలు ప్రారంభించారు.

8 పాఠశాలల్లో సున్నా అడ్మిషన్లు

మొత్తం 23 పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఈ అప్‌గ్రేడ్ జూనియర్ కళాశాలల్లో 8 పాఠశాలల్లో ఒక్కరు కూడా చేరలేదు. వీటిలో కొడవలూరు మండలం యల్లాయపాళెం జడ్పీహెచ్ఎస్, ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జలదంకి మండలం సోమవరప్పాడు జడ్పీహెచ్ఎస్, వరికుంటపాడు జడ్పీహెచ్ఎస్, వింజమూరు మండలం చాకలికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సైదాపురం జడ్పీ, ముత్తుకూరు జడ్పీ పాఠశాలల్లో సున్నా అడ్మిషన్లు నమోదుకావడం గమనార్హం. మిగిలిన 15 హైస్కూల్ ప్లస్‌లలో మాత్రం ప్రథమ సంవత్సరంలో 354, ద్వితీయ సంవత్సరంలో 196 మంది కలిపి మొత్తం 550 మంది విద్యార్థులు చదువుతున్నారు. కళాశాలల్లో ఎలాంటి వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



సీజ్ చేసిన ఎరువుల బస్తాల వద్ద వ్యవసాయ అధికారులు

ఎరువుల లెక్క తప్పింది!

● బయటపడుతున్న అక్రమ నిల్వలు

● కలువాయిలో 840 బస్తాల సీజ్

కలువాయి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువుల బస్తాలు బయటపడుతున్నాయి. కలువాయిలోని ఆగ్రో విక్రయ సేవా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 840 బస్తాల ఎరువులను వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం గుర్తించి, సీజ్ చేశారు. ఆ ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయాధికారి (ఏవో) వీ.ప్రతాప్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐపీఎల్ యూరియా 660, ఐపీఎల్ పొటాష్ 180 బస్తాలు ఉన్నట్లు గుర్తించామని, వీటివిలువ విలువ రూ.4.5 లక్షలు ఉంటుందని ఏవో తెలిపారు. ఈ ఎరువులు కొనుగోలు చేసిన డిస్ట్రిబ్యూటరీ పేరు ఓ ఫాంలో నమోదు కాకపోవడంతోపాటు స్టాక్ రిజిష్టరులో కూడా నమోదు చేయలేదని వివరించారు. ఇలా నిబంధనలకు వ్యతిరేకంగా ఎరువులు నిల్వ ఉండటంతో సీజ్ చేసినట్లు చెప్పారు. ఎరువుల వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా, సల్ఫర్ గుళికలు, ఇతర కాంప్లెక్స్ ఎరువులతో లింకు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన వ్యారులను హెచ్చరించారు.

'సోమశిల'లో 72.234 టీఎంసీల నీరు

అనంతసాగరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 2,575 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 72.234 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 1,200, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువ 350 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది.

నాడు అలా.. నేడు ఇలా!

● కాలువలపై నీటి యాజమాన్యం చేసేవారేరీ..?

● ఈ ఏడాదీ జరగని లస్కర్ల నియామకం

● ఇప్పటికీ ప్రభుత్వం నుంచి రాని అనుమతులు

● అధికారులు సకాలంలో ప్రతిపాదనలు పంపని ఫలితం

6

చింత చచ్చినా పులుపు చావలేదన్నట్టుగా ప్రభుత్వం మారినా ఇరిగేషన్ శాఖలో పరిస్థితులు మాత్రం మారడం లేదు. పూర్తి ఆయకట్టులో సాగు మొదలైనప్పటికీ లస్కర్ల నియామకానికి మాత్రం ఇంతవరకూ అనుమతులు లభించలేదు. ఇప్పటికే సాగు మొదలై నెల రోజులు గడిచింది. ఇక పంట పూర్తయ్యాక లస్కర్లను నియమిస్తారా? అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం అనుమతులు ఇస్తామన్నప్పుడు జిల్లా నుంచి అధికారులు ప్రతిపాదనలు పంపలేదు. తీరా అధికారులు ప్రతిపాదనలు పంపాక ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు కావడం లేదు. తప్పు ఎవరిదన్నది పక్కన పెడితే ఈ ప్రభావం మాత్రం రైతాంగంపై తీవ్రంగా పడుతోంది. ఇది పరోక్షంగా రాష్ట్ర ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది. ప్రస్తుతానికి ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు ఉంది కాబట్టి విచ్చలవిడిగా కాలువలకు వదిలేస్తున్నారు. ఇలా నీటి యాజమాన్యం సక్రమంగా జరగకపోతే ప్రాజెక్టుల్లో నీరు తరిగిపోయి రెండో పంట సమయంలో భూములను బీడు పెట్టుకోవాల్సిన దుస్థితి దాపురిస్తుంది. గతేడాది ఇదే జరిగింది. అయినా ఇరిగేషన్ శాఖ గుణపాఠం నేర్వలేదు.





విలేకరులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్, పక్కన మల్లికార్జున్, సుజయ్‌బాబు

లబ్ధిదారులకు టిడ్కో రుణ విముక్తి

● బ్యాంకర్లకు ప్రభుత్వమే చెల్లిస్తుంది ● జూన్ నాటికి మొదటి దశ ఇళ్ల పూర్తి

● గృహ సముదాయాల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేస్తాం

● ఏపీ టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్ వెల్లడి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో లబ్ధిదారులకు ప్రభుత్వం ఊరట ఇచ్చిందని, బ్యాంకులకు కట్టాల్సిన రూ.102 కోట్లను ప్రభుత్వమే చెల్లిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో అజయ్‌కుమార్ మాట్లాడారు. వైసీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని నిలిపివేయడంతో పాటు పూర్తయిన గృహాలను కూడా లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. బ్యాంకు నుంచి లబ్ధిదారుల పేరుతో తీసుకున్న రుణాన్ని గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందని, దీంతో లబ్ధిదారులపై బ్యాంకర్ల ఒత్తిడి తీసుకొచ్చారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం టిడ్కో కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. లబ్ధిదారులపై బ్యాంకర్ల చేస్తున్న ఒత్తిడిని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. రుణాలను ప్రభుత్వం చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. వచ్చే ఏడాది జూన్ నాటికి మెదటి దశ ఇళ్లను పూర్తి చేస్తామన్నారు. అలాగే టిడ్కో ఇళ్ల సముదాయంలో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నేతలు నూనె మల్లికార్జున, సుజయ్‌బాబు, సుందర్‌రామిరెడ్డి, లాయర్ శ్రీరామ్, ప్రసాద్ పాల్గొన్నారు.

'రాళ్లపాడు' పాపం గత ప్రభుత్వానిదే!

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు రిజర్వాయరు కుడికాలువ స్టాప్‌లాక్ గేటు విరిగిపడిపోయిన పాపం గత ప్రభుత్వానిదేనని, నిర్వహణ కోసం విడుదల చేసిన నిధులు బొక్కేయడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. సోమవారం కందుకూరులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ 2021-22, 2022-23లలో ప్రాజెక్టు నిర్వహణ కోసం వచ్చిన రూ.63 లక్షలలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మండిపడ్డారు. స్టాప్‌లాక్ గేటు విరిగిపోతే నిధులు వచ్చేవరకు ఆగకుండా రూ.15 లక్షలు తన సొంత డబ్బు ఖర్చుచేసి రైతులకు నీరందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది చివరి ఆయకట్టు వరకు నీళ్లందించే బాధ్యతను తాను తీసుకుంటానని రైతులకు భరోసా ఇచ్చారు. తాత్కాలిక మోటార్ల ద్వారా నీరందించి ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గాక పడిపోయిన గేటును లేపేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాళ్లపాడు ప్రాజెక్టు పరిస్థితిని ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లతున్నామని, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఆధునిక టెక్నాలజీ గేట్లు అందుబాటులోకి వచ్చినా ఈ ప్రాజెక్టుకు 75 సంవత్సరాల నాడు ఏర్పాటు చేసిన గేట్లే ఉండటం పట్ల మంత్రి కూడా విస్మయం వ్యక్తం చేశారని అన్నారు. రానున్న వేసవిలో పూర్తిస్థాయి మరమ్మతులకు చర్యలు తీసుకోవటం జరుగుతుందని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రాజెక్టు దుస్థితికి కారణమైన వారే నేడు రాజకీయాలు చేస్తూ తమపై బురద జల్లాలని చూస్తున్నారని అయితే వారి ఆటలను రైతులు అర్థం చేసుకోలేనంత అమాయకులు కాదని మండిపడ్డారు. అభివృద్ధి మండలి పేరుతో కొందరు విమర్శలు చేస్తున్నారని, అభివృద్ధి మండలికి తాను వ్యతిరేకం కాదనీ, ఉదయం వైసీపీ కార్యాలయంలో జగన్ జన్మదిన వేడుకలు జరిపి సాయంత్రం అభివృద్ధి మండలి పేరుతో ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

ఇంకెన్నాళ్లు!

● ఆగిన కండలేరు లెఫ్ట్ కెనాల్ పనులు

● కూటమి ప్రభుత్వమైనా శ్రద్ధ చూపేనా?


పొదలకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ పథకంలో భాగమైన కండలేరు ఎడమ కాలువ లైనింగ్ పనులు ఏడు నెలలుగా ఆగిపోయాయి. ఈ కాలువ ద్వారా మూడు మండలాల్లోని 32 చెరువులకు నీరు అందించడంతోపాటు 27వేల ఎకరాలకు సాగు నీరందుతోంది. తెలుగుగంగ హైలెవల్ స్లూయిజ్ నుంచి కనుపూరు కాలువ వరకు లైనింగ్ పనులకు రూ.39.12 కోట్లు మంజూరయ్యాయి. 2021, సెప్టెంబరులో అప్పటి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పనులు ప్రారంభించారు. అనంతరం పులికల్లు స్పిల్‌వే దాటి నరసింహకండ్రిగ గ్రామ సమీపం వరకు 19కిలోమీటర్ల వరకు పనులు చేశారు. రెండేళ్ల నుంచి మిగిలిన లైనింగ్ పనులను పూర్తి చేయకుండా వదిలివేశారు. లైనింగ్ పూర్తయితే ఆయకట్టు విస్తీర్ణం రెట్టింపు అయ్యే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కాలువకు 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే సామర్థ్యం ఉండగా, లైనింగ్ పనులు పూర్తయితే 455 క్యూసెక్కుల నీటిని విడుదల అవకాశం ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వం అన్నదాతల ఆశలను అడియాశలు చేసింది. పనులను అసంపూర్తిగా వదిలేసింది.

● కాకాణి చొరవ చూపి ఉంటే...

ఈ కాలువ కింద చేజర్ల, పొదలకూరు, నెల్లూరు రూరల్ మండలాలకు సాగునీరు అందుతుంది. డ్యాంలో నీరు తక్కువగా ఉన్నప్పుడు కాలువ చివరి ఆయకట్టుకు నీరందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా కాకాణి అప్పట్లో ప్రత్యేక చొరవ చూపి ఉంటే ఎప్పుడో లైనింగ్ పనులు పూర్తయ్యేవి. కమీషన్ మీద ఉన్న శ్రద్ధ లైనింగ్ పనులపై లేదని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాకాణిని పలు సందర్భాల్లో విమర్శిస్తూనే ఉన్నారు. రైతులకు తక్షణ అవసరమైన కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పట్టించుకోకుండా, విద్యుత్‌బిల్లుల బకాయిలు చెల్లించకుండా, కండలేరు లైనింగ్ పనులు ప్రారంభించారు. ఆ పనుల్లో కమీషన్ అందగానే ఆపేశారని ఇప్పటికీ కాకాణిని, సోమిరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శిస్తుంటారు. ఒక్క ఏడాదిలో పూర్తి చేయాల్సిన లైనింగ్ పనులను రెండున్నర ఏళ్లయినా పూర్తి చేయని గత వైసీపీ ప్రభుత్వ అసమర్థతను ప్రజలు విమర్శిస్తూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వమైనా లైనింగ్ పనులు పూర్తిచేసేలా చొరవ చూపాలని అన్నదాతలు కోరుతున్నారు.



కండలేరు ఎడమ కాలువ



పుచ్చకాయపై ఏసుప్రభువు

ప్రపంచ వ్యాప్తంగా బుధవారం క్రిస్మస్‌ను జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో సూక్ష్మచిత్రాల కళాకారుడు గంధవళ్ల ఉమాశంకర్ పుచ్చకాయపై క్రీస్తు చిత్రాన్ని చిత్రీకరించి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నగరంలోని సుంకు చెంగన్న ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)





శారాబిలాక్ ముస్తాబు

కోవూరు పట్టణంలోని శారాబిలాక్ చర్చి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. శత వసంతాలు నిండిన శారాబిలాక్ చర్చిలో ప్రతి ఏటా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది అంతకంటే ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. దీంతో ముందుగానే చర్చితోపాటు, ఆ వీధిలోనూ విద్యుద్దీపాలతో అలంకరించారు. చర్చిలో పలు కార్యక్రమాల నిర్వహణ, భారీ క్రిస్మస్ కేక్ కట్ చేసేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు.

- కోవూరు,(ఆంధ్రజ్యోతి)

విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జలదంకి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో ఏఈలకు పట్టణాలపై మోజు... పేరుతో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్పందించారు. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు ట్రాన్స్‌కో ఏఈలు నియామకం లేక సబ్‌ఇంజనీర్లు ఇన్‌చార్జిలుగా ఉండటమే ప్రధాన కారణం అని ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరగా ఏఈల నియామకం చేపట్టేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

● కాలువలపై నీటి యాజమాన్యం చేసేవారేరీ..?

● ఈ ఏడాదీ జరగని లస్కర్ల నియామకం

● ఇప్పటికీ ప్రభుత్వం నుంచి రాని అనుమతులు

● అధికారులు సకాలంలో ప్రతిపాదనలు పంపని ఫలితం

● ప్రజాప్రతినిధులకు తెలుసో.. తెలియదో?

● పూర్తి ఆయకట్టులో మొదలైన సాగు



నాడు అలా.. నేడు ఇలా!

నెల్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చెరువులు, కాలువల నుంచి నీటిని అవసరం మేరకు చివరి ఆయకట్టు వరకూ విడుదల చేయడంలో లస్కర్ల పాత్ర కీలకం. వీరు కాలువలపై తూములు, చెక్కలను అవసరం మేరకు ఎత్తుతూ, దించుతూ ఉంటారు. ఇంతటి కీలకమైన లస్కర్ల వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. గడిచిన మూడు సీజన్లుగా లస్కర్ల నియామకం జరగలేదు. లస్కర్లకు అప్పటివరకూ పనిచేసిన వేతనాలను పెండింగ్ పెట్టడమే కాకుండా తొలగించింది. ఇటీవల కొంత మొత్తాన్ని సర్దుబాటు చేయగా, ఇంకా రూ.85 లక్షల వరకూ వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. జిల్లాకు సుమారు 230 మంది లస్కర్ల అవసరం ఉండగా, ఏడాదికి పది నెలలు మాత్రమే నెలకు రూ.10,500 చొప్పున వేతనం చెల్లిస్తుంటారు. ఈ లెక్కన చూసుకున్నా ఏడాదికి రూ.2 కోట్లు మాత్రమే లస్కర్లకు ఖర్చవుతుంది. అయితే, వీరు సక్రమమైన నీటి యాజమాన్యం ద్వారా అంతకన్నా అనేక రెట్లు విలువైన నీటిని పొదుపు చేయడంతోపాటు రైతుల ఇబ్బందులను తొలగిస్తుంటారు. కానీ వైసీపీ ప్రభుత్వం వీరిని అర్థంతరంగా తొలగించి రైతాంగానికి సమస్యలు తెచ్చి పెట్టింది. గతేడాది రెండో పంట సమయంలో సుమారు 20 టీఎంసీల నీరు లస్కర్లు లేని మూలంగా దుర్వినియోగం జరిగింది. ఆ ప్రభావం గతేడాది రబీ సాగుపై పడింది. సగం ఆయకట్టు మాత్రమే సాగు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిపై అప్పటి ప్రతిపక్ష నేతలు, ఇప్పటి ఎమ్మెల్యేలు అనేక విమర్శలు చేశారు.

ప్రభుత్వం వేరు.. అదే తీరు..!

● ఎవరికీ పట్టడం లేదు!

ప్రకృతి సహకరించడం, ప్రాజెక్టుల్లోకి పుష్కలంగా నీరు చేరడంతో ఈ ఏడాది పూర్తి ఆయకట్టుకు నీటి కేటాయింపులు జరిపారు. సోమశిల ప్రాజెక్టు కింద 5.5 లక్షల ఎకరాలు, కండలేరు కింద 2.26 లక్షల ఎకరాల ఆయకట్టు సాగు జరుగుతోంది. మొత్తంగా చూసుకుంటే జిల్లాలో అధికారికంగా, అనధికారికంగా ఏడు లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు జరుగుతోంది. ఈ సమయంలో లస్కర్ల అవసరం చాలా ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తప్పే ఇప్పుడూ జరుగుతోంది. సాగు మొదలై నెల రోజులు గడిచినా ఇంత వరకూ లస్కర్ల నియామకానికి అనుమతులు రాలేదు. గత నెలలో ఓఅండ్ఎం పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పుడే లస్కర్ల నియామకానికి కూడా ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం ఆదేశించినా జిల్లా రెగ్యులర్ ఇరిగేషన్ అధికారులు మాత్రం పట్టించుకోలేదు. మిగిలిన జిల్లాల్లోనూ, ఆఖరుకు తెలుగు గంగ ప్రాజెక్టు కింద లస్కర్ల నియామకానికి అనుమతులు వచ్చాయి. అంతా అయిపోయాక అధికారులు తీరిక చేసుకొని ప్రతిపాదనలు పంపారు. కానీ ఆ తర్వాత ప్రభుత్వం నుంచి స్పందన లేకపోయింది. దీనిని అధికారులు కూడా పట్టించుకోవడం మానేశారు. ఆఖరుకు ఈ విషయం ప్రజాప్రతినిధులకు తెలుసో లేదో కూడా తెలియదు. రెండు, మూడు నెలల క్రితం జరిగిన జడ్పీ సమావేశం, జిల్లా అభివృద్ధి మండలి సమావేశాల్లో లస్కర్ల సమస్యపై ప్రస్తావించిన ఎమ్మెల్యేలు ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే అధికారులు ఈ విషయాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడం లేదని తెలుస్తోంది.

మరోసారి రిమైండ్ చేస్తాం

లస్కర్ల నియామకానికి సంబంధించి ప్రతిపాదనలు పంపాం. పెండింగ్ వేతనాలు రూ.85 లక్షలు చెల్లించాలని కూడా నివేదించాం. ఇంకా అనుమతులు రాలేదు. మరోసారి ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు రిమైండ్ చేస్తాం.

- దేశా నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ

గాలేరు-నగరి ఈఈ హరిబాబుపై వేటు

ఆదాల కంపెనీకి అక్రమంగా బ్యాంకు గ్యారెంటీ వాపస్

శాఖాపరమైన విచారణకు ఆదేశం ● తాజాగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

తిరుపతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుకు సంబంధించి తిరుపతి ఎఫ్‌ఏసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)గా వ్యవహరిస్తున్న సీహెచ్ హరిబాబును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. నెల్లూరు జిల్లా వైసీపీ నేత ఆదాల ప్రభాకరరెడ్డికి చెందిన నిర్మాణ కంపెనీకి.. నిబంధనలు ఉల్లంఘించి బ్యాంకు గ్యారెంటీ విడుదల చేసిన కారణంగా ఆయనపై వేటుపడింది. ఈ పథకం కింద కడప జిల్లా నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కాలువ తవ్వాల్సి ఉంది. శేషాచల పర్వతాలు అడ్డుగా ఉన్నందున టన్నెల్ కూడా తవ్వాలి. ఈ పనుల ఇన్వెస్టిగేషన్, డిజైన్లతో పాటు మెయిన్ కెనాల్ 245వ కిలోమీటరు నుంచి 262.100 కిమీ వరకు కాలువ తవ్వకం.. అలాగే 262.100 కిమీ నుంచి 272.800 కిమీ వరకూ బాలాజీ టన్నెల్-2 తవ్వకం, లైనింగ్ పనులకు 2007-08లో నాటి ప్రభుత్వం జలయజ్ఞం కింద టెండర్లు పిలిచింది. ఆదాల ప్రభాకరరెడ్డికి చెందిన మెస్సర్స్ ఏపీఆర్‌సీఎల్-సీఆర్ ఎస్ఎస్‌జీ (జేవీ) హైదరాబాద్ కంపెనీకి టెండర్లు ఖరారయ్యాయి. ప్రభుత్వం ఆ కంపెనీకి మొబిలైజేషన్ అడ్వాన్సు కూడా చెల్లించింది. ఆ పనులకు సంబంధించి ఆ కంపెనీ రూ.1.36 కోట్లు బ్యాంకు గ్యారెంటీ ఇచ్చింది. ఎంతకాలమైనా పనులు చేపట్టలేదు. దీంతో ఇంజనీరింగ్ అధికారులు కంపెనీకి నోటీసులు జారీ చేశారు. అడ్వాన్సు తీసుకుని కూడా పనులు చేపట్టనందున తీసుకున్న అడ్వాన్సు మొత్తాన్ని ప్రభుత్వానికి వాపస్ చేయాలని నోటీసుల్లో కోరారు. దీనికి ప్రతిగా కంపెనీ ప్రతినిధులు తమకు సకాలంలో అవసరమైన అనుమతులు, ఆమోదాలు ఇవ్వలేదని, దానివల్ల పనులు చేపట్టలేకపోయామని సమాధానమిచ్చారు. మొబిలైజేషన్ అడ్వాన్సుతో మెషినరీ కొనుగోలు చేశామని, పనులు లేక వాటిని ఖాళీగా పెట్టినందున తామే నష్టపోయామని అందులో పేర్కొన్నారు. అడ్వాన్సు నిధులు పోను ప్రభుత్వమే తమకు అదనంగా సుమారు రూ.91 లక్షలు చెల్లించాలని క్లెయిమ్ చేశారు. అప్పటి నుంచి ఆ వివాదం పెండింగులో ఉంది. కరోనా సమయంలో కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన బాకీలేవైనా ఉంటే వాటికి సరిపడా మాత్రమే బ్యాంకు గ్యారెంటీలు ఉంచుకుని మిగిలిన గ్యారెంటీలను విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దానికనుగుణంగా ఆదాల కంపెనీకి కూడా గాలేరు-నగరి ప్రాజెక్టు ఎస్ఈ, ఈఈ నోటీసులిచ్చారు. అడ్వాన్సు వెనక్కి చెల్లించి బ్యాంకు గ్యారెంటీ వాపస్ తీసుకోవాలని కోరారు. ఆ అధికారులు నిబంధనల ప్రకారం నిక్కచ్చిగా వ్యవహరించడంతో 2022-23లో వారిపై బదిలీ వేటు పడింది. ఆ స్థానంలో హరిబాబును ఎఫ్‌ఏసీ ఈఈగా నియమించారు. ఆయన వచ్చీ రాగానే ఆదాల కంపెనీకి ప్రభుత్వమే బాకీ పడిందని పేర్కొంటూ కంపెనీకి బ్యాంకు గ్యారెంటీని రిలీజ్ చేసేశారు. ఫలితంగా ప్రభుత్వం చెల్లించిన మొబిలైజేషన్ అడ్వాన్సును ఎలా వెనక్కి రాబట్టాలో అంతుబట్టక ఇరిగేషన్ ఉన్నతాధికారులు సతమతమవుతున్నారు. ఈ వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు గ్యారెంటీలను విడుదల చేసిన హరిబాబుపై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. ఆ క్రమంలో అతడిని సస్పెండ్ చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పంట కాలువైనా పర్లేదు... కబ్జా చేసేస్తాం !



కబ్జాకు గురైన జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కాలువ

నెల్లూరురూరల్, డిసెంబరు 23, (ఆంధ్ర జ్యోతి): నగరంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం చాలా సులభం. ఎందుకంటే అధికారులుకానీ, ప్రజాప్రతినిధులుకానీ ఎవరూ పట్టించుకోరు. ఈ ఫొటోలో కనిపిస్తున్న ప్రాంతం చింతారెడ్డిపాళెం కూడలి. జాతీయ రహదారికి ఆనుకుని ఎన్టీఆర్‌నగర్ వైపు పెద్ద పంటకాలువ ఉంది. ఇది జలవనరుల శాఖ ఆస్తి. దీన్ని ఆక్రమించి, చదును చేసి రెస్టారెంట్లు, హోటళ్లు, బార్లు, ఇతర వాణిజ్య సముదాలు నిర్మిస్తున్నారు. అయినా ఇరిగేషన్ అధికారులు నోరుమెదపడం లేదు. కన్నెత్తి కూడా చూడడం లేదు. రూ. లక్షలు కాదు కదా.. రూ. కోట్లు విలువైన స్థలమిది. ఈ ఆక్రమణలు తొలగిస్తారో.. కొనసాగిస్తారో.. చూడాలి మరి..!

విద్యారంగం ఉన్నతికి కృషి

● సమగ్ర శిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య

నెల్లూరు (విద్య), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యారంగ ఉన్నతికి కృషి చేస్తానని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) డీ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఎస్ఎస్ఏ ఏపీసీగా ఉదయగిరి ఎంఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఎకనామిక్స్ లెక్చరర్ వెంకటసుబ్బయ్యను నియమించడంతో ఆయన సోమవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాకు చెందిన తాను ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా సేవలందించానన్నారు. విద్యారంగంలో అనుభవంతో పాటు స్వస్థలం కావడంతో జిల్లాపై తనకు అవగాహన ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో విద్యాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయనకు ఎస్ఎస్ఏ కార్యాలయ సిబ్బంది, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.



బాధ్యతలు చేపడుతున్న వెంకట సుబ్బయ్య

అనవసరాలకూ తరలిపోతున్న ఇసుక, తువ్విసుక

ఇసుకతో మునిగిపోతున్న పొలాలు, లేఔట్లు



దామరమడుగు వద్ద ఇసుక, తువ్విసకతో వ్యవసాయ భూములను చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

'ఉచితం' ముసుగులో ఇష్టారాజ్యం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీ విచ్చలవిడితనంతో ఇష్టారాజ్యంగా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వంలో సామాన్యులు సైతం ఇసుకను కొనలేక ఇళ్ల నిర్మాణాలు ఆపేసుకున్నారు. లబ్ధిదారులకు రీచ్‌ల నుంచి ఇసుక ఉచితంగా పంపిణీ చేస్తామన్న నాటి ప్రభుత్వం లోడింగ్, రీచ్ నుంచి యార్డు దాకా రవాణా చార్జీలతోసహా వసూలు చేసింది. దీంతో లబ్ధిదారులకు తడిసి మోపెడయ్యింది. అయితే, అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి పేదలకు ఇసుక కష్టాలు తలెత్తకుండా సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టారు. అయితే, అధికార, విపక్ష పార్టీతోపాటు అధికారులంతా అక్రమార్కులతో కుమ్మక్కై. అవసరాలకన్నా ఆ ముసుగులో అనవసరాలకే లేఅవుట్లు, ప్లాట్లు, పొలాలకు తరలిస్తున్నారు. అంతేగాక చెన్నై, బెంగళూరు వంటి మహానగరాలకూ గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్నారు. బుచ్చి, కోవూరు, ఇందుకూరుపేట, విడవలూరుతోపాటు పెన్నా పరివాహక ప్రాంతాల నుంచి లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా రేయింబవళ్ల ఇసుకను తరలిస్తున్నారు. బుచ్చి మండలంలోని మినగల్లు, జొన్నవాడ, కాగులపాడు, దామరమడుగు గ్రామాల పరిధిలోని పెన్నా పరివాహక ప్రాంతాలలో విచ్చలవిడిగా ఇసుక, తువ్విసుకను తవ్వి తోడేస్తున్నారు. బుచ్చినుంచి షుగర్ ఫ్యాక్టరీ దాకా జాతీయ రహదారికి ఇరువైపులా విచ్చలవిడిగా వెలసిన లేఅవుట్లకు తేరకొచ్చిన ఇసుక, తువ్విసుకను తరలిస్తున్నారు.

● తీరం వెంబడి తవ్వకాలు

మినగల్లు నుంచి దామరమడుగు పల్లిపాళెం దాకా పెన్నా తీరం వెంబడి చేపడుతున్న ఇసుక తవ్వకాలతో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం వుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. భవిష్యత్తులో సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పవని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అక్రమార్కుల ఆగడాలపై తెలిసినా, ఎవరైనా ఫిర్యాదు చేసినా భూగర్భ జలశాఖ అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. మరోవైపు దామరమడుగు, మినగల్లు, జొన్నవాడ, కాగులపాడు ప్రాంతాల్లోని పెన్నా కరకట్టలు ధ్వంసమవుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఇసుకాసురులపై చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



ఇసుక ట్రాక్టర్ల రాకపోకలతో ధ్వంసమైన పెన్నా కరకట్ట

జనరల్ ఆసుపత్రి

● ప్రైవేట్ ఆసుపత్రులు తిరస్కరించిన కేసులు సైతం నయం ● ఏడాదికి 500లకుపైగా మేజర్ ఆపరేషన్లు ● పేద, మధ్య తరగతికి ఎంతో ఉపయోగం

ఆర్థోలో ఆధునిక వైద్యం

● ఇందుకూరుపేట మండలం రాముడుపాళెం రొయ్యల గుంట వద్ద కాపలాగా ఉన్న చెంబేటి నాగరాజు, అనితల కుమారుడు ఏడేళ్ల వరణ్ ఆడుకుంటూ ఏరియేటర్ ఫ్యానుపై పడిపోయాడు. అందులో ఇరుక్కుని కాళ్లు, చేతులు విరిగాయి. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా అయిదు చోట్ల కాళ్లు చేతులు విరిగి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ బాలుడికి చికిత్స చేసేందుకు ప్రైవేట్ ఆసుపత్రులు తిరస్కరించాయి. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకు రాగా ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు ఈ కేసును ఒక చాలెంజ్‌గా తీసుకుని ఆ బాలుడికి 8 గంటలపాటు శస్త్రచికత్స చేసి పునర్జన్మను ప్రసాదించారు.

● నెల్లూరు నగరానికి చెందిన మాలకొండయ్యకు రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగాయి. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా ఆర్థోపెడిక్ వైద్యులు 4 గంటలపాటు శస్త్రచికిత్స చేసి ఆయన కాళ్లను సరిచేశారు. రెండు నెలల విశ్రాంతి అనంతరం ప్రస్తుతం మాలకొండయ్య తన పనులు తాను చేసుకుంటున్నాడు.



ఐదుచోట్ల ఎముకలు విరిగిన చిన్నారి వరుణ్‌కు శస్త్రచికిత్స చేసిన వైద్య నిపుణులు (ఫైల్)

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కీళ్లు, ఎముకల విభాగం (ఆర్థోపెడిక్) ఆధ్వర్యంలో ప్రస్తుతం అత్యాధునిక వైద్య సేవలు అందుతున్నాయి. ఈ విభాగానికి ఏటా 30 వేల మంది వ్యాధిగ్రస్తులు వస్తుండగా వారిలో 4వేల మంది వరకు ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. జీజీహెచ్‌కు ఎక్కువగా పేద, మధ్య తరగతి ప్రజలే వస్తుంటారు. వీరుకాక ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డ వారిని ఇక్కడికి తరలిస్తుంటారు. అలాంటి వారికి ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు విజయవంతంగా శస్త్రచికిత్స చేస్తున్నారు. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు చేతులెత్తేసిన కేసులకు కూడా జీజీహెచ్ వైద్య నిపుణులు మెరుగైన చికిత్సలు అందించి ప్రశంసలు అందుకున్న సంఘటనలు ఉన్నాయి. 8 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్‌లు, ఒక ప్రొఫెసర్ ఇక్కడ అత్యాధునిక వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఎక్స్‌రేతోపాటు ఎమ్మారై, సిటీస్కాన్ వంటి పరికరాలు ఉండటంతో వైద్యులు సకాలంలో చికిత్సలు అందించేందుకు వీలు కలుగుతోంది.



మేజర్ శస్త్రచికిత్సలు

జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగంలో ఏటా 500కుపైగా మేజర్ శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. మరో 1300 వరకు మైనర్ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఇవే కాక ఏడాదిగా మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఇన్‌పేషెంట్లకు అన్ని సదుపాయాలతో కూడిన భవనాలు అందుబాటులో ఉండటం, ఆధునిక వైద్య చికిత్సలు అందిస్తుండటంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నాలుగేళ్లుగా శస్త్రచికిత్సలు ఇలా...

సంవత్సరం	మేజర్ శస్త్రచికిత్సలు	మైనర్ శస్త్రచికిత్సలు
2021-22	510	1180
2022-23	567	1320
2023-24	662	1482
2024-25	549	1294

అన్ని రకాల శస్త్రచికిత్సలు చేస్తున్నాం

ఆర్థోపెడిక్ విభాగంలో క్రిటికల్ కేసులను కూడా చాలెంజ్‌గా తీసుకుని శస్త్రచికిత్సలు చేస్తున్నాము. రోగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. మొత్తం ఆర్థోపెడిక్ విభాగంలో ఉన్న 12 మంది వైద్య నిపుణులు కేసులను ప్రత్యేకంగా చూస్తున్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసర చికిత్సలు అందిస్తున్నాం.

- డాక్టర్ మస్తాన్‌బాషా, అసోసియేట్ ప్రొఫెసర్



బండిపై సెల్‌గాటం!!

అతి వేగంగా వాహనాలు నడపొద్దు... సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దు... ట్రాఫిక్ నిబంధనలు పాటించండి.. అంటూ జిల్లా ఎస్పీ మొదలు పోలీసు అధికారులు నిత్యం మొత్తుకుంటున్నా కొందరిలో మార్పు రావడం లేదు. ఉరుకులు, పరుగుల జీవితంలో భాగం కావచ్చు, ఒత్తిడో, ఫ్యాషనో, థ్రిల్ కోసమో... కారణం ఏదైనా నెల్లూరు నగరంలో అతి వేగంగానూ, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడపటం ద్వారా ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నారు. అన్నా... బండిపై చెలగాటాలొద్దు.. భద్రంగా ఇంటికి పోదాం!.



- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

నేర వార్తలు

పాత నేరస్థుల అరెస్టు

● రూ.21.05 లక్షల విలువచేసే సొత్తు స్వాధీనం



నిందితుల వివరాలు తెలుపుతున్న ఏఎస్పీ సీహెచ్ సౌజన్య

నెల్లూరు(క్రైం), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరుసగా ఇళ్లలో చోరీలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఇద్దరు పాతనేరస్థులను నెల్లూరు సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.21.05 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాలులో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డితో కలిసి నిందితుల వివరాలను వెల్లడించారు. నగరంలోని పొర్లుకట్టలో విజయలక్ష్మి కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె ఈనెల 15న ఇంటికి తాళం వేసి వ్యక్తిగత పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలు, నగదును దోచుకెళ్లారు. రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చిన ఆమె చోరీ ఘటనపై సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలంలో లభ్యమైన ఆధారాలు, సాంకేతికత సాయంతో పాతనేరస్థులైన వెంకటేశ్వరపురం జనార్దన్‌రెడ్డి కాలనీకి చెందిన ఏ సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు, వెంకటేశ్వరపురానికి చెందిన ఆర్ శ్రీనివాసులు అలియాస్ శీనును నిందితులుగా గుర్తించారు. సోమవారం నిందితులను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా పొర్లుకట్టతోపాటు నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి పొర్లుకట్టలో అపహరించిన 49 సవర్ల బంగారు ఆభరణాలు, 149 గ్రాముల వెండి వస్తువులు, రూ.లక్ష నగదు, నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో దొంగలించిన 190 గ్రాముల వెండి వస్తువులు మొత్తం రూ.21,05,010 సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై నవాబుపేట పోలీసుస్టేషన్ పరిధిలో సస్పెక్ట్‌షీట్లు ఉన్నాయి. నవాబుపేట, వేదాయపాలెం, నెల్లూరు రూరల్, కోవూరు, కొడవలూరు పోలీసు స్టేషన్లలో చోరీ కేసులు, రంపచోడవరంలో గంజాయి కేసున్నట్లు ఏఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి చోరీసొత్తును రాబట్టేందుకు కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది విజయమోహన్ సుబ్బారావు, వెంకటేశ్వర్లు, తదితరులను ఏఎస్పీ అభినందించి నగదు రివార్డులను అందజేశారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

● రూ. 1.42 లక్షల సొత్తు స్వాధీనం



పట్టుబడిన సొత్తుతో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణు

నెల్లూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు - గొలగమూడి రహదారిలోని ఇందిరమ్మ కాలనీకి సమీపాన ఓ విద్యుత్ దుకాణంలో ఇటీవల జరిగిన చోరీ కేసులో ముగ్గురు వ్యక్తులను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ కేసు వివరాలను రూరల్ స్టేషన్‌లో సీఐ జీ వేణు సోమవారం వెల్లడించారు. ఈనెల 19న ఎంవీఆర్ ట్రేడర్స్ దుకాణంలో చోరీ జరగ్గా, రూ. 1.42 లక్షల విలువ చేసే కరెంట్ కాయల్స్ అపహరణకు గురైనట్లు యజమాని మహేంద్ర ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు పాత నేరస్థులైన కల్లూరుపల్లి, కొండాయపాళెంకు చెందిన షేక్ సుభాని, కొల్లపూడి నవీన్, పల్లెకారి బాలాజీలను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారు నేరం అంగీకరించినట్లు చెప్పారు. వారి వద్దనుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామని, వారికి రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన ఎస్సై లక్ష్మణరావు, ఏఎస్సై సురేంద్రబాబు, పీసీలు ఆదినారాయణ, మోహన్‌కృష్ణ, మోహన్‌బాబులకు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు నగదు బహుమతి అందచేసి, రివార్డుల కోసం ఎస్పీకి సిఫార్సు చేసినట్లు సీఐ తెలిపారు.

లారీ క్యాబిన్‌లో మంటలు

బిట్రగుంట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం అల్లూరు సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి లారీ అగ్నిప్రమాదానికి గురైంది. స్థానిక ఎస్ఐ జంపానికుమార్ వివరాల మేరకు హర్యానా నుంచి పాండిచేరి వెళుతున్న లారీ క్యాబిలో మంటలు చెలరేగాయి. ఈ సమయంలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వెళుతున్న లారీని డ్రైవర్ నెమ్మదిగా కిందకు దించుకుని మంటలార్పేందు ప్రయత్నించాడు. అప్పటికే మంటలు ఎక్కువ కావడంతో కింద దూకి కావలి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు సంఘటనా స్థలానికి మంటలు అదుపులోకి తెచ్చారు. ఈ ఘటన జరగడంతో సుమారు కిల్లోమీటరు వరకు రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. పోలీసుల చొరవతో రాకపోకలకు అంతరాయం ట్రాఫిక్‌ను పునరుద్ధించారు.



జాతీయ రహదారిపై దగ్ధమవుతున్న లారీ

విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టండి : ఎస్ఈ

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను పూర్తిగా వసూలు చేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ అధికారులను ఆదేశించారు. పట్టణ, డివిజన్ అధికారులతో ఆయన కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థ మనుగడ సాధించాలంటే విద్యుత్ బకాయిలను పూర్తిగా వసూలు చేయాలన్నారు. అలాగే 33కేవీ లైన్లను నిరంతరం పెట్రోలింగ్ చేయాలని సూచించారు. దీనివల్ల ఎక్కడయినా లోపాలుంటే తెలిసే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. మీటర్ రీడింగ్‌ను ఐఆర్‌డీఏ స్కానింగ్ ద్వారా తీసి సకాలంలో వినియోగదారులకు అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పట్టణ డీఈలు అశోక్, సునీల్, కిరణ్, ఏఈలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	105
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7313
వెండి కిలో ధర	రూ. 89,900
వెండి ఒక గ్రాము	రూ.92.90

45 రోజుల గడువు ఎందుకు?

● నామమాత్రంగా రెవెన్యూ సదస్సులు

● అనువంశిక భూముల రికార్డులు కావాలంటూ మెలికలు

● భూముల రిజిస్ట్రేషన్ పత్రాలు చూపుతున్న రైతులు

● వెబ్‌ల్యాండ్‌లో పేర్లు కూడా మార్చని వైనం

● ఇందుకా... సదస్సులంటూ రైతుల పెదవి విరుపు

అల్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూముల సమస్యలు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులతో రైతులకు నిరాశే ఎదురవుతోంది. అక్కడికక్కడే సమస్యను తీర్చుతారనుకున్న రైతులు అర్జీలు స్వీకరించి 45రోజులు అంటూ సమాధానం చెబుతుండటంతో రెవెన్యూ సదస్సులు అవసరమా అంటూ రైతులు పెదవి విరుస్తున్నారు. సమస్యలు తీర్చేందుకు సమయం ఎందుకు అంటూ రైతులు భావిస్తున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వే ప్రక్రియలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించడం లేదని, కనీసం అన్ని పత్రాలు సమర్పించినా వెబ్‌ల్యాండ్‌లో పేర్లు మార్పు చేర్పులు అక్కడికక్కడే జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు. అర్జీలు తీసుకునేందుకేనా రెవెన్యూ సదస్సులు అంటూ చలోక్తులు విసురుతున్నారు. ఇక్కడ ఎటువంటి సమస్యలు పరిష్కారం కావడం లేదంటూ రైతులు చాలా మంది రెవెన్యూ సదస్సులకు వెళ్లడం లేదు.



పురిణి రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు (ఫైల్)

● **అధికారుల మెలికలు:**

అనువంశీకంగా సంక్రమించిన భూములను రైతులు తరతరాలుగా అనుభవించుకుంటూ పంటలు పండిస్తున్నారు. గత కొంతకాలంగా భూములకు ధరలు పెరుగుతుండడంతో వాటి పరిరక్షణ ప్రక్రియ చేపట్టమంటే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని అధికారులు సదస్సులో చెప్పడం కరెక్టు కాదని రైతులు అంటున్నారు. అనువంశీకంగా వచ్చిన భూమికి కూడా రికార్డు తీసుకుని రావాలని మెలిక పెడుతుండడంతో చేసేది లేక నిరాశగా వెనుదిరుగుతున్నారు. అవే ఉంటే ఇక రెవెన్యూ అధికారులతో ఏం పనంటూ ప్రశ్నిస్తున్నారు. భూసమస్యలు తీర్చుతామని చెప్పి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి రికార్డులు తీసుకరావాలని చెప్పడం ఎంతవరకు సమంజమని అంటున్నారు.

● **ఇక సమస్యలు తీరినట్టే**

అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా తీరని భూ సమస్యలు రెవెన్యూ సదస్సులో అర్జీలు ఇస్తే సరిపోతుందా సమస్య తీరిపోతుందా అనే అనుమానాలు రైతులు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇచ్చే భరోసా రైతులు నమ్మలేకపోతున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా నాయకులు చెప్తేనే పనులు చేసే పరిస్థితికి భిన్నంగా ఈ ప్రభుత్వంలో కొనసాగుతోందని భావిస్తున్నారు. గ్రామ సభల్లో కూడా ఇదే తీరును ప్రదర్శించడం సబబేనా అంటూ రైతులు తమ భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్‌కు అష్టకష్టాలు

ఇదిలా ఉండగా ఇదివరకే రిజిస్ట్రేషన్ చేయించుకొని ఉన్న రైతులకు దస్తావేజుతో పాటు సదరు భూమికి సంబంధించిన వెబ్‌ల్యాండ్ రికార్డు, పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతుల భూములను రీసర్వే చేపట్టగా నూతనంగా ఎల్‌పిఎం నెంబరును ఏర్పాటు చేశారు. వెబ్‌ల్యాండ్‌లో పూర్తిగా సర్వే నెంబర్లు మారిపోయాయి. ఇదివరకే ఉన్న పట్టాదారు పాసుపుస్తకంలో ఉన్న నెంబర్లు.. నూతనంగా మంజూరు చేసిన పట్టాదారు పాసుపుస్తకంలో నెంబర్లు వేరుగా ఉండటంతో సదరు రైతు భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. నూతన సర్వేనెంబర్ల ఆధారంగానే వెసులుబాటు అవుతుందే తప్ప తమకు చెందిన రిజిస్ట్రేషన్ పత్రాల్లో ఉండే సర్వే నెంబర్లు, వెబ్‌ల్యాండ్ రికార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు పనికిరాకుండా పోయాయి. ఈ విధంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 47 మండలాల్లోని పరిస్థితి ఈ విధంగా మారింది.

అక్కడికక్కడే పరిష్కరించాలి



భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న అధికారులు అక్కడికక్కడే సమస్య పరిష్కారించేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే గ్రామసభలకు అర్థం ఉంటుంది. లేకపోతే అర్జీలు దాఖలు చేసి పరిష్కారానికి తేదీలు నిర్ణయించడం కోసం సదస్సులు ఎందుకు? అవసరమైన రైతులు ప్రతి సోమవారం ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో ఇస్తూనే ఉన్నారు. అవి పరిష్కారం కానివి ఇప్పుడు ఎలా అవుతాయి.

- విడవలూరు దశరథరామిరెడ్డి, నార్తుమోపూరు

సమస్య తీర్చితేనే ఫలితం



రీ సర్వే ప్రక్రియ జరిగినట్టు చాలామంది రైతులకు నేటికీ తెలియదు. గత ప్రభుత్వంలో చేపట్టిన ఈ ప్రక్రియలో రైతులకు తెలియజేయకుండా ఇష్టారాజ్యంగా రీసర్వే ప్రక్రియను చేపట్టి ఇష్టమొచ్చిన రైతుల పేర్లు నమోదు చేశారు. ఇష్టమైన విస్తీర్ణం కేటాయించారు. అత్యధికమంది భూములకు సంబంధించిన పేర్లు వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాలేదు. ఇలాంటి సమస్యలకు పూర్తి పరిష్కారం చూపుతారని అనుకున్నాం. కానీ రెవెన్యూ సదస్సులతో ఈ పరిస్థితి కన్పించడం లేదు. అర్జీలు స్వీకరించి తరువాత పరిష్కారమంటే అది కుదిరే పని కాదు.

- ఎల్లు సాల్మన్‌రాజు, అల్లూరు

తీరని సమస్యలు.. తగ్గని వినతులు

అర్జీదారులతో కలెక్టరేట్ కిటకిట

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులు, గ్రామ సభలు ఏర్పాటు చేసినా రెవెన్యూ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. మండల స్థాయిలో అర్జీలు స్వీకరిస్తున్నా, మంత్రులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నా, కలెక్టరేట్‌కు మాత్రం అర్జీదారులు తగ్గటం లేదు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 263 అర్జీలు రాగా, వాటిలో రెవెన్యూశాఖకు సంబంధించి 127 అర్జీలు ఉన్నాయంటే సమస్యలు ఎంత జటిలంగా ఉన్నాయో అర్థమవుతుంది. కాగా సర్వే సమస్యలకు సంబంధించి సర్వేశాఖకు 12 అర్జీలు వచ్చాయి. ఇలా ప్రతీ వారం వందల్లో అర్జీలు వస్తున్నా, ఎందుకు పరిష్కరించలేక పోతున్నారో అధికారులు వివరించలేక పోతున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు కుటుంబాలతో కలెక్టరేట్ కిటకిటలాడింది.

● **ప్రత్యేక దృష్టి సారించండి**

రెవెన్యూ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి అర్జీలు తీసుకుని, సంబంధిత అధికారులను పిలిచి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, అధికారులు

● నెల్లూరు నగరంలో ఒక్కొక్క రేషన్ షాపునకు 850 రేషన్ కార్డులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నగర చౌకధరల దుకాణా డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేగు కుమారస్వామి కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు.

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన

అంబేడ్కర్‌ను కేంద్రమంత్రి అమిత్‌షా దూషించటం తగదంటూ దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. మల్లి మాట్లాడుతూ అమిత్‌షా అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, సత్యవతమ్మ, దాసు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు తత్కాల్‌లో చెల్లింపు

నెల్లూరు(విద్య), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) :వచ్చే మార్చిలో జరగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు ఇప్పటివరకు ఫీజు చెల్లించని విద్యార్థులు తత్కాల్ పథకం కింద ఈనెల 24 నుంచి 31లోగా ఫీజు చెల్లించవచ్చని ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని జనరల్, ఒకేషనల్, ప్రైవేట్ అభ్యర్థులు ఈ తత్కాల్ పథకం కింద రూ.3వేలు అపరాధ రుసుం, ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు శ్రద్ధ తీసుకుని విద్యార్థులంతా పరీక్షలకు హాజరయ్యేలా చూడాలన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు 27న ఎంపికలు

నెల్లూరు(విద్య), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) రాజస్థాన్‌లోని జైపూర్‌లో జనవరి 7 నుంచి 13వతేదీ వరకు జరిగే జాతీయ సీనియర్ పురుషుల, మహిళల వాలీబాల్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టు ఎంపికలను విజయవాడ డీఎస్ఏ ఎన్‌టీఆర్ స్టేడియంలో ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే .యతిరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఒలింపిక్ అసోసియేషన్ పర్యవేక్షణలో అడహాక్ కమిటీ ఆఫ్ వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. పాల్గొనే ఏపీ జట్టు ఎంపికలకు ఆసక్తి కలిగిన జిల్లా క్రీడాకారులు ఆయా తేదీల్లో ఉదయం 7 గంటలకు హాజరు కావాలన్నారు.

ఎన్ఎంఎంఎస్ ప్రాథమిక కీ విడుదల

నెల్లూరు(విద్య), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 8న జరిగిన జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్ఎంఎంఎస్)కి సంబంధించిన ప్రాథమిక కీ విడుదలైనట్లు డీఈవో డాక్టర్ బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపా రు. ప్రాథమిక కీ ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ www.bsc.ap.gov.inలో అందుబాటులో ఉందన్నారు. దీనిపై ఇప్పటికే అభ్యంతరాలను పూర్తి చేసి తుదిజాబితా విడుదల చేశామని, విద్యార్థుల వివరాలు పరిశీలించుకోవాలని ఆయన తెలిపారు.




ఫిర్యాదుదారు ఇచ్చిన అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

ఫిర్యాదులపై విచారణ జరిపి న్యాయం చేస్తాం : ఎస్పీ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన విచారణ జరిపి, చట్టప్రకారం న్యాయం చేస్తామని ఎస్పీ జీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా వ్యాప్తంగా 90 మంది ఫిర్యాదుదారులు వచ్చి వారి సమస్యలను విన్నవించుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు, డీటీసీ డీఎస్పీ గిరిధర్‌రావు, లీగల్ అడ్వయిజర్‌శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

విజయ డెయిరీ డైరెక్టర్లుగా ఇద్దరు ఎంపిక



డైరెక్టర్లుగా ఎన్నికైన హరికృష్ణారెడ్డి, బాబునాయుడు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విజయ డెయిరీలో ఖాళీగా ఉన్న రెండు డైరెక్టర్ల పోస్టులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నెల్లూరులోని డెయిరీలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్వేపల్లి, కోవూరు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో ఇద్దరు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరిగొండ పాల సొసైటీ సభ్యుడు జలదంకి హరికృష్ణారెడ్డి, తిరుమలపూడి పాల సొసైటీ సభ్యుడు తాళ్ళూరు బాబు నాయుడు డైరెక్టర్లుగా ఎంపికయ్యారు.

నిబంధనలు పాటించండి

● చట్టాలపై ప్రజలకు పోలీసుల అవగాహన

నెల్లూరు(క్రైం), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రోడ్డు నిబంధనలు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి వీడియోలు చూపించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన, డ్రంకన్‌డ్రైవ్, హెల్మెట్‌ధారణ, సీట్ బెల్ట్ విషయాలపై అవగాహన కల్పించారు. స్క్రీన్‌పై వీడియోలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలు, సమాజ వ్యతిరేక పనులపై అవగాహన కల్పించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

● **హెల్మెట్ వినియోగంపై ర్యాలీ**

హెల్మెట్ లేని ప్రయాణం మీ జీవితానికి ప్రమాదమని ప్రజలకు అవగాహన కల్పిస్తూ నగరంలో సోమవారం పోలీసులు ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఈ ర్యాలీ సాగింది. ఏఆర్ అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య ర్యాలీని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, భద్రతే ధ్యేయంగా ఈ హెల్మెట్ ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ ప్రదర్శనలో ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ డీఎస్పీ జి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఏవో చంద్రమౌళి, సీఐలు, ఎస్ఐలు, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



తెరపై అవగాహన దృశ్యాలు వీక్షిస్తున్న అర్జీదారులు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఎస్పీ సీహెచ్ సౌజన్య

అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు

● పట్టించుకోని అధికారులు, పాలకులు

కావలి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వస్త్ర వ్యాపారంలో రెండో ముంబాయిగా పేరు పొందిన కావలిలో పారిశుధ్యం కొరవడింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు మాత్రం చెత్త కుప్పలు, పందుల సంచారంతో దుర్గంధం వెదజల్లుతూ కంపుకొడుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. చుట్టుపక్కల నివాసాల్లోని చెత్తను స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో వేస్తుండటంతో ఈ సమస్య నెలకొందని వాపోతున్నారు. అలాగే బస్టాండ్‌లో ప్రయాణికులకు సరిపడా మరుగుదొడ్లు లేవు. పరిసర ప్రాంతాల్లో నివాసం ఉన్న వారు రాత్రి సమయాల్లో బస్టాండ్ పరిసరాల్లో బహిరంగ మల విసర్జన చేస్తుండటంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. బస్టాండ్ నుండి గ్యారేజీలోకి వెళ్లే మార్గంలో నడవాలంటే ముక్కు మూసుకో వాల్సిన పరిస్థితి ఉంది. విద్యా, వ్యాపారపరంగా ఎంతో పేరుగాంచిన పట్టణానికి ఇతర ప్రాంతాల నుండి వ్యాపార నిమిత్తం వచ్చేవారు బస్టాండ్ దుస్థితిని చూసి నివ్వెరపోతున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్ సమీపంలో పారిశుధ్య పనులు చేపట్టి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.


చెత్తకుప్పలతో గ్యారేజీకి వెళ్లే రోడ్డు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆత్మకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 11 మంది లబ్ధిదారులకు రూ.11.18 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరు క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు ఇంటి పెద్దగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బాధితుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

● ఏఎస్ పేట: అనుమసముద్రం కంకణాల లక్ష్మీదేవమ్మ అనే మహిళ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె ఆర్థిక పరిస్థితి కూడా సరిగా లేకపోవడంతో గ్రామ టీడీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి తెలిపారు. దీంతో మంత్రి ఆనం చొరవతో రూ. 120583 సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేయించారు. ఆ చెక్కును సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. దీంతో మంత్రి ఆనంకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆవులను బందిలదొడ్డికి తరలించండి

కావలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఆవులు రోడ్లపై సంచరిస్తున్నాయని వాటిని నియంత్రించాలని టీవీఎస్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ తోట వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డితో కలిసి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఆవులు రోడ్లపై తిరుగుతూ రాత్రంతా ఉంటున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవటం దారుణం అన్నారు. ఈ సమస్యతో రాత్రి సమయంలో వచ్చే వాహనదారులకు అవి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికైనా స్పందించి ఆవుల యజమానులకు చెప్పి అవి రోడ్లపైకి రాకుండా చూడాలని వారు వినకపోతే వాటిని బందీలదొడ్డికి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గురుకుల విద్యార్థినులకు వైద్య పరీక్షలు

సంగం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులకు సోమ వారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కళాశాలకు చెందిన 15మంది జ్వరాలతో వైద్యశాలకు వెళ్లారు. గమనించిన వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి కళాశాలకు చేరుకుని విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి సాధారణ జలుబు, దగ్గు, జ్వరాలు మాత్రమేనని గుర్తించారు.

పేదలకు దుస్తుల పంపిణీ

బిట్రగుంట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ బేతనీపేట దిసెంట్రల్ తెలుగు బాప్టిట్ చర్చి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం పారిశుధ్య కార్మికులు, పేదలకు దుస్తులు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు పాస్టర్ వైరత్నం, స్థానిక సంఘ కాపరి ఏఎస్ జేసఫ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చి ఆవరణంలో నూతనంగా నిర్మించిన బాప్తీస్మము తొట్టి, అదనపు భవనాన్ని ప్రారంభించారు. సండేస్కూల్ చిన్నారులతో మినీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బచ్చు నవీన్, కమిటీ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

విద్యా ఉపకరణాల అందజేత

కొండబిట్రగుంట డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం రామిశెట్టి వెంకటసుబ్బారావు ట్రస్ట్ సభ్యులు భోజన ప్లేట్లు, పాఠశాలకు మెగా మైకును ఎంఈవో జయమ్మ, నరసింహారావుల చేతుల మీదుగా హెచ్ఎం ప్రసాద్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ మెతుకు రాజేశ్వరి, విద్యాకమిటీ చైర్మన్ మధు, కౌసల్య, సహోపాధ్యాయిని విజిత ఉన్నారు.

శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళి

ఉదయగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ గణిత దినోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.నారాయణస్వామి, వైస్ ప్రిన్సి పాల్ ఏ నరసింహులు, అధ్యాపకులు కేసీ విక్ర మ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నారాయణస్వామి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల వైద్యఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్యలు సూచించారు. సోమవారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రం భవనంలో వైద్యఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బందికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. జ్వరపీడితులు ఉన్న గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. అనంతరం నెలవారీ నివేదికలు తనిఖీచేసి తగు సూచనలు, సలహాలు అందజేశారు.

మద్యం దుకాణాన్ని ఎత్తేయండి

● కలెక్టర్‌కు పోకూరు ఎస్సీ కాలనీవాసుల వినతి

వలేటివారిపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం షాపును ఎత్తివేయాలని స్థానిక ఎంపీటీసీ నూకతోటి విజయలక్ష్మీతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులతో కలిసి సోమవారం నెల్లూరులో కలెక్టర్ ఆనంద్‌కు గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేసినట్లు పోకూరు ఎస్సీ కాలనీవాసులు తెలిపారు. మద్యం షాపును నివాస గృహాలు ప్రక్కనే పెట్టడంతో మందుబాబులు మద్యం సేవించి ఆ వైపు వెళ్లే మహిళలను దుర్భాషలాడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తలపల శివకుమారి, జి. వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, నూకతోటి వీరనారాయణ తదితరలు ఉన్నారు.

కందుకూరులో ఉత్తర బైపాస్ రోడ్డు


ఎమ్మెల్యే ఇంటూరిని సత్కరిస్తున్న చుండి సాగునీటి సంఘం సభ్యులు

కందుకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఉత్తర బైపాస్‌రోడ్డు నిర్మించాల్సిన ఆవశ్యకతను ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరించగా తక్షణం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్థికశాఖకు సూచించినట్లు ఎమ్మెల్యే ఇంటూరి తెలిపారు. అలాగే నియోజకవర్గంలో అద్దె భవనాల్లో నడుస్తున్న ఉద్యాన కళాశాలకు చినలాటిరిపి వద్ద శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరుకు కూడా హామీ ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లా నుంచి తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతామన్న హామీ కూడా త్వరలోనే నెరవేరుతుందని చెప్పారు. రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు పనులకు నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానన్నారు. 2029 ఎన్నికల్లో తిరిగి విజయం సాధించటమే లక్ష్యంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. 17ఏళ్లుగా కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు జరగకుండా చేస్తున్న పాపం ఎవరిదో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, షేక్ రఫీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గుండెపోటుతో మరణించిన గణేష్‌నగర్ టీడీపీ సీనియర్ నేత తిరువల్లూరి కృష్ణమాచారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట దామా మల్లేశ్వరరావు, రావూరి రామకోటయ్య, తలమంచి బ్రహ్మయ్య, కంచర్ల సుబ్బారావు తదితరులున్నారు.

● గుడ్లూరు: పాజర్ల మాజీ సర్పంచ్ ఉమ్మడి ప్రోలు కోటేశ్వరరావు మృతి పార్టీకి తీరనిలోటని శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే పార్టీ నాయకులతో కలిసి స్వగ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మాజీ శాసనసభ్యులు పోతుల రామారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుర్రం మాల్యాద్రి, మేకపో తుల రాఘవయ్య, చుండూరు ప్రసాద్, చిత్తారి మల్లికార్జున, జనిగర్ల నాగరాజు, మేకల మాల్యాద్రి ఉన్నారు.

● వలేటివారిపాలెం: చుండి సాగునీటి సంఘం సభ్యులు మాలకొండ ఆలయ మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సాగునీటి సంఘం చైర్మన్‌ను, సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పసుపులేటి జయరాం, సభ్యులు మీనుగు మాల్యా ద్రి, చెరువుపల్లి మల్లికార్జున, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం రాత్రి రాత్రి 8గంటల సమయంలో శింగమనేనిపల్లె ఎస్సీ కాలనీలో ముట్లూరి అనిల్ సహకారాలతో నిర్మించిన చర్చిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాస్టర్లు జోసఫ్, యెహన్, గుర్రం లక్ష్మీనరసింహం, గౌడపేరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక సభ్యత్వ నమోదు

ఏఎస్ పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో అత్యధికంగా టీడీపీ సభ్యత్వాలు నమోదు చేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు అబ్బూరి రమేష్‌నాయుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. మంత్రి ఆనం ఆదేశాలతో సీనియర్ నాయకులు తాళ్లూరు గిరి నాయుడు, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి పర్యవేక్షణలో అన్ని గ్రామాల నాయకుల చొరవతో 17వేల సభ్యత్వాలు నమోదు చేశామన్నారు.

'తప్పుడు ప్రచారం తగదు'

ఉలవపాడు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తాను వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని కేకు తిన్నట్లు ప్రచారం చేయడం వేసీపీ శ్రేణులకు తగదని కృష్ణాపురం నీటి సంఘం అధ్యక్షుడు కొల్లిబోయిన శేషయ్య సోమవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో సీనియర్ నా యకుడిగా కొనసాగుతున్నా అని, తన భార్య కొల్లి శేషమ్మ టీడీపీ మద్దాతుదారులతో సర్పంచ్‌గా గెలిపొందిందని పేర్కొన్నారు. తనపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు.

ప్రజా విజ్ఞప్తుల దినం

అల్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రజావిజ్ఞప్తుల దినం కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు లక్ష్మీ నారాయణ తెలిపారు. సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రజల నుండి ఆయన అర్జీలను స్వీకరించారు. వీటిలో భూ సమస్యల పైనే అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం

జలదంకి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జలదంకి హేమలత కుటుంబానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రూ.15వేలను ఆర్థికసాయం ప్రకటించారు. మొత్తాన్ని సోమవారం నేతలు నిమ్మల పల్లి రామ్‌చైతన్య, గంటా అశోక్ మృతురాలి తండ్రి బండ్లమూడి చంద్ర మౌళికి అందజేశారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిల ముస్తాబు


విద్యుత్ వెలుగులో సియోన్ ప్రార్థనా మందిరం

ఆత్మకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ పేటలోని సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి, సెంటల్ తెలుగు బాప్టిస్టు చర్చి, సియోన్ ప్రార్థనా మందిరాలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. క్రిస్మస్ ట్రీలను ఏర్పాటుచేసి చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎక్కడ చూసినా క్రిస్మస్ సందడి కనిపిస్తోంది. వస్త్ర దుకాణాలు కళకళలాడుతున్నాయి. వెన్నవాడ, కరటంపాడు, వెంకట్రావుపల్లి, బి.చిరువెళ్ల చర్చిల్లో బుధవారం క్రిస్మస్ వేడుకల్లో సామూహిక ప్రార్థనలు చేసేందుకు తగిన ఏర్పాట్లు పూర్తిచేశారు.


ఆత్మకూరులో విద్యుత్ వెలుగులతో శోభిల్లుతున్న సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి

In the Court of the Principal Junior Civil Judge: Kovur
I.A.No.74/2022
O.S.No.63/2022
1.Takkeda Raghavaiah and 2 Others ... Petitioners/Plaintiffs
Vs
Nalagatla Srinivasa Rao and Others ...Respondents/Defendants
Notice
To
R8: Allam China Ramanaiah S/o. Venkaiah, residing at Thurimerla Village, Dagadarthi Mandal, SPSR Nellore District.
R16:Takkeda Chandra Kaladhar S/o. Raghavaiah, residing at Thurimerla Village, Dagadarthi Mandal, SPSR Nellore District.
పై నెంబరున పిటిషనర్లు/వాదులు [illegible] తే. 02-01-2025 [illegible]
పిడూరు నాగేశ్వరరావు, B.Sc., B.L., పిటిషనర్లు/వాదుల అడ్వకేట్, నెల్లూరు

కందుకూరును 'ప్రకాశం'లో చేర్చాలని ధర్నా

కందుకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో చేర్చాలని యాదవ జేఏసీ అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ప్రజా సంఘాల నాయకులు చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వందరోజుల్లోనే నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతామని చెప్పిన చంద్రబాబునాయుడు 200రోజులు గడిచినా పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఈ విషయంపై ఆలసత్వం చేస్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మిరియం శ్రీనివాసులు

ఎరువుల దుకాణాల తనిఖీ

ఆత్మకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిండికేట్ ఫార్మర్స్ కోఆపరేటివ్ సొసైటీ, గ్రోమోర్ సెంటర్‌లో ఎరువుల నిల్వలను సోమవారం ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టరు, బిల్లు పుస్తకాలు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలను అధీకృత డీలరు వద్దనే కొనుగోలు చేయాలని సూచించారు. మండలంలో 50 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులకు అవసరమైనంత వరకు సరఫరా చేస్తామని తెలిపారు.


తనిఖీ చేస్తున్న ఏడీఏ దేవసేనమ్మ

దోమల నివారణకు చర్యలు

కావలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెంకులఫ్యాక్టరీ గిరిజన కాలనీ, వైకుంఠపురం కాలనీల్లో దోమల నివారణకు అధికారులు ఫాగింగ్ చేపట్టారు. కేవలం కాలువల్లోనే కల్వరుల ఉన్న దోమలను నివారించేందుకు చర్యలు తీసుకున్నారు.


ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

బిజ్జంపల్లిలో వైద్యశిబిరం ఏర్పాటు

ఉదయగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలో వైద్య ఆరోగ్య సిబ్బంది వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'గ్రామాల్లో జ్వరాల విజృంభణ' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకల్పన గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటుచేసి జ్వరపీడితులకు వైద్యసేవలు అందించారు. అనంతరం బిజ్జంపల్లి, కృష్ణారెడ్డిపల్లి, లింగంనేనిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటా లార్వా, జ్వరపీడితుల సర్వే నిర్వహించారు. పలు నివాసాల్లో లార్వాను గుర్తించి తొలగించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది పిక్కిలి హసనయ్య, దేవి, అనురాధ, హజరత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

సీతారామపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేదగర్భ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సోమ వారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు స్థానిక పొలాల్లో వరినాట్లు వేశారు. రైతులు పడే శ్రమ, కష్టం గురించి తెలుసుకున్నారు. రైతుల వేషధారణలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ నరేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


పొలంలో వరి నాటుతున్న చిన్నారులు

In the Court of the Principal Junior Civil Judge: Kovur
O.S.No.63/2022
1.Takkeda Raghavaiah and 2 Others ... Plaintiffs
Vs
Nalagatla Srinivasa Rao and Others ...Defendants
Notice
To
D8:Allam China Ramanaiah S/o. Venkaiah, residing at Thurimerla Village, Dagadarthi Mandal, SPSR Nellore District.
D16: Takkeda Chandra Kaladhar S/o. Raghavaiah, residing at Thurimerla Village, Dagadarthi Mandal, SPSR Nellore District.
పై నెంబరున వాదులు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం తే. 02-01-2025 దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
పిడూరు నాగేశ్వరరావు, B.Sc., B.L., వాదుల తరపు అడ్వకేట్, నెల్లూరు

ఉపకరణాల పంపిణీకి
నేడు దరఖాస్తుల స్వీకరణ

ఉదయగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీ తారామపురం దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లూయిబ్రెయిలీ జయంతి సందర్భంగా దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కోసం మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు అదోని రమణ య్య, ఓవీ సుబ్బరాజులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వరికుంటపాడు, ఉదయగిరి, సీతారామపురం మండలాల్లోని దివ్యాంగులకు బస్సు పాసులు, ట్రైసైకిళ్లు, వీల్‌చైర్‌లు, అంధు లకు చేతికర్రలు, బధిరులకు వినికిడి యంత్రాలు వచ్చేనెల 4వ తేదీన ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం సెల్: 7337268192, 9492680279 అనే నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ


సంగం: ర్యాలీలో పాల్గొన్న సీఐ వేమారెడ్డి



కావలి: మాట్లాడుతున్న సుందరరావు

సంగం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలో సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో హెల్మెట్ ఆవశ్యకతపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్లు ధరించి స్థానిక పోలీస్‌స్టేషన్ నుండి బస్టాండ్, పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాలు జరిగినా ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చునని తెలిపారు. ఎ.

● కావలి: మోటారు వాహన చట్టం నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించి ప్రమాదాలను నివారిద్దామని కావలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందరరావు తెలిపారు. స్థానిక మద్దూరుపాడు డీబీఎస్ ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం విద్యార్థులకు మోటారు వాహన చట్టాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదా రులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఫోర్ వీలర్స్ వాహనదారులు సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. లైసెన్స్ తీసుకోవాలని లేకపోతే చర్యలు తప్పవన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కించరాదని తెలిపారు. విద్యాసంస్థల బస్సులన్నీ సరైన ఫిట్‌నెస్‌తో ఉంటూ అనుభవం ఉన్న డ్రైవర్లను ఏర్పాటు చేసుకోవా లన్నారు. సమావేశంలో సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాయ్, డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ రావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ రచనలు పాఠ్యాంశాలుగా చేర్చాలి

ఉలవపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ రచనలను 6వ తరగతి నుంచి పీజీ వరకు పాఠ్యాంశాలుగా చేర్చాలని పెద్దపట్టపుపాలెం హైస్కూల్‌లో 60మంది విద్యార్థులు చిరునామా రాసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పోస్టుకార్డులను పంపారు. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ చేపట్టిన లక్ష కార్డుల ఉద్యమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని నిర్వహించి టాలెంట్ టెస్ట్, ముగ్గుల పోటీలు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సలీంబాష, గణిత ఉపాధ్యాయులు హరిప్రసాద్, నీరజ, భాస్కర్, కలీల్ భాషా, శరత్, కోటేశ్వరరావు, అనురాధ, బాలయ్య పాల్గొన్నారు.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు

● ఇన్‌చార్జి ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

ఇంటర్వ్యూ...



అనంతసాగరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో జ్వరాల తీవ్రత తగ్గించేలా చర్యలు తీసుకొం టామని, ఇందుకోసం వైద్యసిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు.

? సోమశిల, అనంత సాగరం, మంచాలపల్లిలో పందుల బెడద నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు

! ఈ గ్రామాల్లో పందులు ఎక్కువగా ఉన్నట్లు నా దృష్టికి రాలేదు. సిబ్బందిని అప్రమత్తం చేసి నిర్మూలనకు చర్యలు తీసుకొంటాం.

? కొన్ని సచివాలయాల్లో ఫీల్డ్‌వర్క్ అంటూ విధులకు డుమ్మా కొడుతున్న సిబ్బందిపై చర్యలు ఉంటాయా.

! ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకొన్నప్పటి నుంచి సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నా. ఉద్యోగులు ఉదయం 10-30 నుంచి సా యంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాలి. ఫీల్డ్‌వర్క్‌కు వెళితే మూమెంట్ రిజిష్టర్‌లో వివరాలు ఉండాలి. అలా లేని పక్షంలో వారి జీతం కట్ అవుతోంది.

? పారిశుధ చర్యలు చేపట్టడం లేదని, ఫాగింగ్ చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తు న్నారు..

! అన్ని గ్రా మాల్లో డీవార్మింగ్ చేయి స్తున్నాం. పారిశుధ్యంపై దృష్టి పెట్టాం. దోమ ల వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయిస్తాం.

? పంచాయతీరాజ్ సి బ్బంది కొరతతో పనులెలా సాగుతాయి.

! సిబ్బంది కొరత ఉన్న విషయం వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఉన్న వారితో ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేస్తున్నాం.

సంగమేశ్వరాలయ మాజీ చైర్మన్ మృతి

సంగం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరాలయ మాజీ చైర్మన్ జక్కంపూడి సుబ్బానాయుడు (75) చెన్నై వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. మూడురోజుల కిందట సుబ్బానాయుడు వంట చేయడానికి గ్యాస్ పొయ్యి వెలిగించడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో తీవ్ర గాయాలకు గురికాగా చికిత్స నిమిత్తం చెన్నై వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఉదయం టీ పెట్టుకుని సిలిండర్ ఆపకపోవడంతో లీక్ అయిన మధ్యాహ్నం స్టౌ వెలిగించడంతో మంటలు వ్యాపించి ఉంటాయని బంధువులు భావిస్తున్నారు. ఆమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయాలకతీతంగా రావాలి

ఉదయగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా వెలుగొండ ప్రాజెక్టు పూర్తిచేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని వెలుగొండ సాధన సమితి నాయకులు దస్తగిరి అహ్మద్, నారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కోట్నీస్ వైద్యశాలలో సోమవారం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా వెలుగొండ ప్రాజెక్టు సాధన, మానవ విలువల చైతన్య ప్రచార వేదిక నిర్మాణం కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఉదయ గిరిలో మానవ విలువల చైతన్య ప్రచార వేదిక నిర్మాణానికి వచ్చేనెలలో ప్రకాశం, నెల్లూరులో అఖిలపక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫడ్స్ రమణయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్లపల్లిలో రెవెన్యూ సదస్సు

కొండాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పార్లపల్లిలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో నాలుగు వినతులు అందినట్లు తహసీల్దారు కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ ఎం.ఓంకారం, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొమ్మి కొండలరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అధికారులు

కనుపూరు కాలువ ఆధునికీకరణకు ప్రతిపాదనలు

● ఇరిగేషన్ డీఈఈ సాయిశంకర్ నారాయణ



జిల్లాలోని ప్రధాన సాగునీటి వనరుల్లో ఒకటైన కనుపూరు కాలువ ఆధునికీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు జలవనరుల శాఖ డీఈఈ వై సాయిశంకర్ నారాయణ తెలిపారు. ప్రస్తుతం ఈ కాలువ కింద సాగునీటి పారుదల విషయాలను ఆయన ఆంధ్రజ్యోతికి వివరించారు.

? ప్రతీ వ్యవసాయ సీజన్‌లో వరదల కారణంగా కనుపూరు కాలువ దెబ్బ తింటూనే ఉంది. నివారణ చర్యలు మాటేమిటి.

! కనుపూరు కాలువ ఎక్కడైతే బలహీనంగా ఉందో అక్కడ పటిష్టమైన నిర్మాణాలు చేపట్టేందుకు అంచనాలు వేస్తున్నాము. ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. వీటిని ప్రభుత్వానికి పంపి అనుమతులురాగానే నివారణ చర్యలుంటాయి.

? తాత్కాలిక చర్యల వల్ల రైతులు నష్టపోతున్నారు. శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక ఏమిటి.

! ఈ సారి లోతైన అధ్యయనం చేస్తున్నాము. శాశ్వత నివారణ పనులు చేపట్టి భవిష్యత్‌లో ఎవరూ ఆందోళనకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యాము.

? ప్రస్తుతం కాలువ సామర్థ్యాని కన్నా చాలా తక్కువగా నీటిని వదులు తున్నారు. ఏమైనా ఇబ్బందులున్నాయా...

! కాలువ సామర్థ్యం 450 క్యూసెక్కులు. సాధారణంగా 300 క్యూసెక్కులు వదులుతుంటాము. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఇటీవల 200 క్యూసెక్కులు మాత్రమే వదిలాము.

? ప్రస్తుత రబీలో సాగునీటి కొరత ఉందా.

! అలాంటిది ఎక్కడా లేదు. నాలుగు మండలాల్లోని 80 చెరువులకు కనుపూరు కాలువ నీరు పారుతుంది. ప్రస్తుతం కాలువలో, చెరువుల్లో నీళ్లు రైతాంగానికి అందుబాటులో ఉన్నాయి. ఈ రబీకి ఇబ్బందులు లేవు.

- నెల్లూరు రూరల్,(ఆంధ్రజ్యోతి)

రాజనీతిజ్ఞుడు పీవీ నరసింహారావు

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి గర్వించదగ్గ రాజనీతిజ్ఞుడు పీవీ.నరసింహారావు అని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. మాజీ ప్రధాని పీవీ. నరసింహారావు 20వ వర్ధంతి సందర్భంగా బాలజీ నగర్‌లో మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ రాజనీతిజ్ఞుడు పీవీని కాంగ్రెస్‌పార్టీ విస్మరించడం సిగ్గుచేటన్నారు. నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కి కాంగ్రెస్‌తో విభేదాలున్నప్పటికీ తెలుగువాడు ప్రధానిగా పోటీ చేస్తుంటే మన అభ్యర్థిని పోటీకి పెట్టకూడదని నిర్ణయించారని ఆయన గుర్తుచేశారు. ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ నేత పీవీ అని అన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నాయకులు గుడ్లదొన వాసుదేవరావు, కామేశ్వరప్రసాద్, టీవీఎల్ నరసింహం, పద్య సారస్వత పరిషత్ సభ్యులు పోలవరపు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



పీవీకి నివాళులర్పిస్తున్న కోటంరెడ్డి తదితరులు

భూ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ జరిపించండి : టీడీపీ

వెంకటాచలం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో గొలగమూడిలో జరిగిన భారీ భూ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ జరిపించాలని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని అనికేపల్లి పంచాయతీ పరిధిలోని గొలగమూడి సచివాలయంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు శ్రీనివాసులుకు గ్రామస్థులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజాయాదవ్ మాట్లాడుతూ భూకుంభకోణానికి పాల్పడిన వైసీపీ నేతపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాగులవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 3లో చాకలి చెరువు కింద 27.75 ప్రభుత్వ భూమి ఉండగా 20 ఎకరాల్లో అక్రమంగా ప్లాట్లు వేసి నకిలీ పట్టాలు సృష్టించి విక్రయించారని విమర్శించారు. అక్రమంగా ప్లాట్లు వేసి విక్రయించిన 20 ఎకరాల విలువ రూ.20 కోట్లకుపైగానే ఉంటుందన్నారు. అప్పటి రెవెన్యూ అధికారుల సహకారంతోనే వైసీపీ నేత భారీ భూకుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. మిగిలిన 7.75 ఎకరాల్లో జగనన్న లేఅవుట్ వేసి అర్హులకు కాకుండా అనర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించారని, వీటిపై కూడా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి అన్యాయానికి గురైన అర్హులకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనికేపల్లి, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం : ఆర్డీవో

రాపూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో సమస్యలపై పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను కలె క్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష అనూష పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గిలకపాడు పంచాయతీ పరిధిలోని పిన్నేరు వాగు విషయంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక్కడికి వచ్చామని, క్షేత్రస్థాయిలో ఆక్రమణలను పరిశీలించామన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇ చ్చామన్నారు. ఆక్రమణ భూమిని పక్కాగా సర్వే చేయించి ఎవ్వరికీ ఇబ్బందులు లేకుండాచేసి రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ఎటు వంటి ఆటంకాలు లేకుండా చూస్తామన్నారు. ఆమె వెంట ఎంపీడీవో భవానీ, డిప్యూటీ తహసీల్దారు అశోక్, ఆర్వోలు, సర్వేయర్‌లు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో నాగ సంతోష అనూష

ప్రభుత్వ స్థలాలు కాపాడండి : పీడీఎస్‌యూ

పొదలకూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రహరీ గోడ, వాటర్ ట్యాంక్ పగలకొట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ శనివారం జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ప్రహరీ, వాటర్ ట్యాంక్ పగలగొట్టడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కలెక్టర్, డీఈవో స్పందించి స్కూల్ స్థలం ఆక్రమించుకోవాలని చూస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నేత ఎ.రత్నం, తదితరులు పాల్గొన్నారు.



కూలదోసిన హైస్కూల్ ప్రహరీని పరిశీలిస్తున్న సునీల్

కరాటేలో రవీంద్రభారతికి పతకాలు

నెల్లూరు(విద్య), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రవీంద్రభారతి పాఠశాల విద్యార్థులు కరాటే ఓపెన్ పోటీల్లో పతకాలు సాధించారని జోనల్ ఇన్‌చార్జి శ్రీహరి తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాల విద్యార్థులు నాయబ్‌రసూల్, కుష్వంత్, పునీత్, గిరిధర్ బంగారు పతకాలు, సంజయ్, గ్రేసన్, లెనిన్‌లు కాంస్య పతకాలు సాధించి, గుంటూరులో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధించారన్నారు.కార్యక్రమంలో డీన్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ నిరుపమ, అకడమిక్ ఇన్‌చార్జి రేష్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

నెల్లూరు(విద్య), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని అవెన్యూస్ పాఠశాలలో సోమ వారం ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రిస్మస్ ట్రీ అలంకరించి, క్యారల్స్ పాడి ప్రదర్శించిన నాటకాలు అందరినీ అలరించాయి. చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణలో క్రిస్మస్ ప్రాముఖ్యతను తెలియచేశారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంట కరస్పాండెంట్ కృష్ణచైతన్య, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్వేతసంధ్య, వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.



అవెన్యూస్‌లో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

● కిమ్స్ ఆసుపత్రిలో..

నెల్లూరు(వైద్యం,ఆంధ్రజ్యోతి): నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో సోమవారం ప్రీ కిస్మస్ వేడుకలు జరిగాయి. వైద్య నిపుణులు, నర్సింగ్ సిబ్బంది. పారామెడికల్ సిబ్బంది, టెక్నీషియన్లు, సెక్యూరిటీ గార్డులు తదితరులు పాల్గొన్నారు. క్రీస్తు జననం గురించి ఉపన్యసించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆటల పోటీలు నిర్వహించారు. ఆసుపత్రి ఈడీ గిరినాయుడు, డీజీఎం శివమాల, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులకు వస్త్రాల పంపిణీ

కొండాయపాళెం నగర పాలక ప్రాథమిక పాఠశాలలో సోమవారం జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఉషాకిరణ్ విద్యార్థులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన ప్రీ క్రిస్మస్ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ చేజర్ల మహేష్, హెచ్ఎం ఎం.భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● తోటపల్లిగూడూరు : సౌత్‌ఆములూరు ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్.అహ్మద్‌బాషా క్రిస్మస్ పర్వదినం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు వివిధ వేషధారణలో అలరించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఆర్.సువార్త, వైస్ చైర్మన్ వి.గిరిజకుమారి పాల్గొన్నారు.



టీపీగూడూరు:క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు

వారితో అయ్యేటట్టు లేదు.. నేనే చేస్తా!



మురుగుకాలువలో ఆయిల్ బాల్స్ వదులుతున్న ప్రతాప్‌రెడ్డి

అధికారులతో పెట్టుకుంటే అయ్యేటట్టులేదు.. నేనే రంగంలోకి దిగి మురుగు కాలువల్లో అయిల్ బాల్స్ వదులుతానంటూ నెల్లూరులోని 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి సోమవారం తన డివిజన్ పరిధిలోని మురుగుకాలువలు, గుంతల్లో ఆయిల్ బాల్స్ వేస్తూ కనిపించారు. సచివాలయ ఉద్యోగులు మాత్రం ఆయన చేస్తున్న పనిని చూస్తూ ఉండిపోయారు. ప్రజల ఓట్లేసి గెలిపించినందుకు ఆ మాత్రం సేవ చేయాలిగా... !

-నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి)

పార్కు స్థలాలు ఆక్రమిస్తే.. నేనూరుకోను !

నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి) : 19వ డివిజన్‌లో పార్కు స్థలాలను ఎవరిపడితే వాళ్లు ఇష్టానుసారం ఆక్రమిం చేస్తున్నారు. ఈ విషయంలో మీరు ఊరుకుంటారేమో కానీ.. నేనూరుకోను.. అంటూ ఆ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి, కార్పొరేటర్ భర్త నూకరాజు మదన్ కుమార్‌రెడ్డి సోమవారం కార్పొరేషన్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలని చెప్పారు.

బాస్ వస్తున్నారు.. బి అలెర్ట్

మనుబోలు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మరో రెండు, మూడు రోజుల్లో ఠాణాకు పోలీస్‌బాస్ రానున్నారు. అందరూ అలర్ట్‌గా ఉండాలని ఎస్ఐ శివరాకేష్ సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన ఠాణాలో ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లతో సమావేశమై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

న్యూస్ బాక్స్

నేడు మైనార్టీ వ్యవహారాల సలహాదారు రాక

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారని ఐ, పీఆర్ డీడీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జిల్లా మైనార్టీశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను తనిఖీ చేస్తారని ఆయన తెలిపారు.

బహిరంగ మద్యపానంపై కఠిన చర్యలు : ఎక్సైజ్ సీఐ

నెల్లూరురూరల్,డిసెంబరు23,(ఆంధ్రజ్యోతి) : మద్యం షాపుల వద్ద బహిరంగంగా మద్యం తాగినా , అందుకు అనుకూల వాతావరణం కల్పించినా కఠిన చర్యలు తీసుకుంటామని నెల్లూరు రూరల్ ఎక్సైజ్ సీఐ ప్రసన్నలక్ష్మి తెలిపారు. సోమవారం ఎస్ మునీర్ అహ్మద్, సిబ్బందితో వెంకటాచలం, మనుబోలు, నెల్లూరురూరల్ ప్రాంతాల్లోని మద్యం షాపులను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించామని చెప్పారు. ఎంఆర్పీ ఉల్లంఘనలు, రికార్డు నమోదు, బహిరంగ మద్యపానం వంటి అంశాల పై ఈ తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ తరహా తనిఖీలు తరుచు నిర్వహిస్తామని, ఎక్కడైన ఉల్లంఘటనలు కనిపిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

తోటపల్లిగూడూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవెరపాలెంలో సోమవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి సహకారంతో ఎల్వీ ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి గంగపట్నం సుధీర్‌బాబు, టీడీపీ సీనియర్ నాయకుడు ముత్యాల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు చేపట్టాలి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : నిషేధిత జాబితాలో లేకుండా పెండింగ్‌లో ఉంచిన డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లను వెంటనే చేపట్టాలని డాక్యుమెంటు రైటర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు సోమవారం జిల్లా రిజిస్ట్రార్‌ను కోరారు. ఈ మేరకు ఆయన లేఖ రాశారు. కోర్టు కేసుల్లో, నిషేధిత జాబితాలో లేని, సర్వే నంబర్ల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటి రిజిస్ట్రేషన్లు చేసే అధికారాన్ని ప్రభుత్వం జిల్లా రిజిస్ట్రార్‌లకు ఇచ్చినందున వెంటనే ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.

మద్యం షాపుపై న్యాయపోరాటం

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వాకర్స్‌రోడ్డు, పరమేశ్వరీనగర్ ప్రాంతంతో నూతనంగా ఏర్పాటు చేసిన లక్కీ వైన్‌షాపుపై న్యాయపోరాటం చేస్తామని వైన్ షాపు వ్యతిరేక వేదిక నాయకులు సయ్యద్ సర్దార్ తెలిపారు. సోమవారం జర్నలిస్టు భవన్‌లో ఆయన మాట్లాడుతూ గత సోమవారం ఈ ప్రాంతంలో కొన్ని అవాంఛనీయ శక్తులు వైన్ షాపు దగ్గర కల్పించిన ఉద్రిక్త పరిస్థితులకు వైన్ షాపు వ్యతిరేక వేదికకు ఎలాంటి సంబంధం లేదన్నారు. హైకోర్టు సూచన మేరకు వైన్ షాపు వ్యతిరేక వేదిక కూడా ఈ కేసులో ముందుకు సాగుతుందన్నారు. సమావేశంలో సయ్యద్ నవీద్, షకీల్ అహ్మద్, సయ్యద్ సర్దార్, జేబేర్‌బాయ్, అబ్దుల్ గని, సందాని, రఫీ, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతి ప్రదానం

నెల్లూరు(సాంస్కృతికం) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్‌ను పురస్కరించుకుని సోమవారం మురిగిపూడి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు స్టోన్‌హౌస్‌పేట ఆర్ఎస్ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాస్ మోడల్స్ తయారీలో పోటీ నిర్వహించారు. పోటీలో సుమారు 50 మంది పాల్గొన్నారు. వాటిలో చక్కని వాటికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, రెండు కన్సొలేషన్ బహుమతులతోపాటు పాల్గొన్న వారందరికీ పెన్నులు అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ ఇన్‌చార్జి చిన్నయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలు ఆనందంగా ఉంటే కాకాణికి ఎందుకంత కడుపుమంట?

పొదలకూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి నియోజకవర్గంలో అన్నదాతలు ఆనందంగా ఉంటే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి ఎందుకంతా కడుపుమంటని తెలుగుదేశం పార్టీ యూత్ నాయకులు ప్రశ్నించారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం మీడియా సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు కలగట్ల సందీప్ మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే అభివృద్ధి పథంలో దూసు కుపోతుందని తెలిపారు. కాకాణి మాత్రం నిద్రలే చింది మొదలు కరోనా ప్యాలెస్‌లో కూర్చుని సోషల్ మీడియాలో అవాస్తవాలు పోస్టులు పెట్టి శునకానందం పొందుతున్నారని తెలిపారు. సర్వేపల్లి తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఆదాల మురళీరెడ్డి, టీడీపీ యూత్ నాయకుడు అట్లూరి అనిల్‌కుమార్‌రెడ్డి మాటాడుతూ రూ.6కోట్లతో ఇరిగేషన్ కాలువల మరమ్మతులు జరిగితే రూ.20కోట్ల అవినీతి అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కాకిలా అరవడమే పనిగా పెట్టుకున్నాడని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జహీర్, విజయ్‌రెడ్డి, రాజా, మోహన్, మధు, బాబులు, ప్రసాద్ పాల్గొన్నారు.

వేబ్రిడ్జి వద్ద ఆందోళన

పొదలకూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన ఆ వేబ్రిడ్జి ఇళ్ల మధ్య వద్దంటూ స్థానికులు రెండో రోజు సోమవారం కూడా ఆందోళన చేశారు. పలుమార్లు అధికారులకు అర్జీలు సమర్పించిన ఏ ఒక్క అధికారి పట్టించుకోలేదని వారు ఆరోపించారు.

తాగునీటి వసతికి అవసరమైన సామగ్రి ఇవ్వండి

● కమిషనర్ వినతి

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని జగనన్న లేఔట్లుకు తాగునీటి సరఫరాకు అమృత్ 2.వో పథకంలో పైపులైన్లు, కొళాయిలు ఏర్పాటు చేయాలని కమిషనర్ కోరారు. సోమవారం గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో రాష్ట్ర పట్టణాభివృద్ధిశాఖామంత్రి పొంగూరు నారాయణ, ప్రిన్సిపుల్ సెక్రటరీ కన్నబాబులు అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గ్యాప్ వర్క్‌షాపులో బుచ్చికి నగరపంచాయతీకి సంబంధించి పై సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి, అధికారులు అందుకు సుముఖం వ్యక్తం చేశారు.

రత్నం విద్యాసంస్థల్లో రైతు దినోత్సవం

నెల్లూరు(విద్య), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం సరస్వతినగర్ డాక్టర్ కిషోర్స్ రత్నం హైస్కూల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సమీపంలోని పొలాలను సందర్శించి రైతులతో ముచ్చటించారు. అనంతరం రైతులను సత్కరించి సంప్రదాయ దుస్తులను, పండ్లు అందచేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్‌లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి, జీఎం రామ్మూర్తి నాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాళ్లు మణిమాల, ప్రపూర్ణ, పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీ ప్రజలు ప్రజా విజ్ఞప్తుల దినాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ కోరారు. సోమవారం నగర పంచాయతీ కా ర్యాలయంలో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె స్థానిక ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

డోర్ డెలివరీని వినియోగించుకోండి : సురేష్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం ఆర్టీసీ తీసుకువచ్చిన డోర్ డెలివరీని వినియోగించుకోవాలని నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవం సందర్భంగా సోమవారం నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ ఆర్టీసీ సరుకు రవాణాలో మరో ముందడుగు వేసి ఇంటి వద్దకే సరుకులు చేర్చేలా డోర్ డెలివరీ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల ముఖ్య కేంద్రాలు, ప్రధాన నగరాలు అయిన తిరుపతి, విజయవాడ, రాజమహేంద్రవరంతోపాటు 80 కేంద్రాల్లో డోర్ డెలివరీ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు.

● అధికారులపై అసహనం

ఆత్మకూరు బస్టాండును జోనల్ చైర్మన్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు కూర్చోవడానికి తగినన్ని కుర్చీలు లేవని, ఉన్న కొన్ని కుర్చీలు కూడా నాసిరకంగా ఉన్నాయన్నారు. బస్టాండు వద్ద ట్రాఫిక్ సమస్యను కూడా అధికంగా ఉందని, ఇప్పటికే ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో నెల్లూరు 2వ డిపో మేనేజర్ శివకేశవ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

రాళ్లపాడు నీటి పంపిణీకి చర్యలు తీసుకోండి : సీపీఐ

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటిని పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దామా అంకయ్య కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1994లో వర్షాలకు రాళ్లపాడు రిజర్వాయర్ నిండిందన్నారు. చేపల కాంట్రాక్టర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు అడ్డుకోవటంతో గేట్లు కొట్టుకుపోయాయ న్నారు. దీనివల్ల కుడికాలువ గేటు గట్టిగా బిగుసుకు పోయిందన్నారు. వెంటనే గేటుకు మరమ్మతులు చేసి నీటిని వదలాలన్నారు. ఏపీ రైతు సంఘం నేతలు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తూ జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ షాన్‌వాజ్, ప్రధాన కార్యదర్శి గంగపట్నం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ, రైతు సంఘం నేతలు

మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకాకు ఘన నివాళి

నెల్లూరు(సాంస్కృతికం) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి 75వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నివాళులర్పించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తన నివాసంలో ఆనం వివేకా చిత్రపటానికి కుటుంబ సభ్యులతో కలిసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెల్లూరు రాజకీయాల్లో ఆనం వివేకానందరెడ్డిది చెరగని సంతకమని తెలిపారు. వివేకానందరెడ్డి లేని లోటు తమ కుటుంబానికి ఎప్పటికీ తీరనిదని పేర్కొన్నారు.



ఆనం వివేకా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

క్యాలెండరు ఆవిష్కరణ


నెల్లూరు (వైద్యం) (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సోమవారం ఆస్థాన్ ఏ యూసుఫియా వారి నూతన సంవత్స ర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంతసాగరానికి చెంది న ఆస్థాన్ పీఠాధిపతి సయ్యద్ నజీర్ సాహెబ్, అజీజ్ నివాసంలో ఆయన్ను కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్క రించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు షేక్ ఖలీల్ అహ్మద్, జిల్లా ఆవాజ్ కమిటీ సభ్యులు సయ్యద్ అన్సర్ తదతరులు పాల్గొన్నారు.



క్యాలెండరు ఆవిష్కరిస్తున్న అజీజ్, తదితరులు

నిరంతరాయంగా మండల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వేదాయపాలెంలోని అయ్యప్పగుడిలో అయ్యప్ప స్వామివారికి కేరళ సాంప్రదాయం ప్రకారం కార్తీకమాస మండల పూజలు సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం పాలభిషేకం, మహాగణపతి హోమం, ఉషఃపూజ, నవకాభిషేకం, ఉచ్ఛపూజ, శ్రీవేలి ఉత్సవం, సాయంత్రం మహాదీపారాధన, శ్రీవేలి ఉత్సవం, పడికర్పూరం, హరిహరవాసనం, కార్యక్రమాలు జరిగాయి. గురువాయురప్పన్ మహావిష్ణు ఆలయంలో ధనుర్మాస పూజలు ఘనంగా జరిగాయి. మండల పూజలకు పులి పుల్లయ్యయాదవ్, నారాయణమ్మ దంపతులు, రాచర్ల రవికుమార్, బుజ్జమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం అన్నదానం ఉభయకర్తలుగా కత్తుల విజయకుమార్, సుధావాణి దంపతులు, రాత్రి బిక్షకు హర్షవర్ధన్, లక్ష్మీమనోజ్ఞ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు జీ శేషగిరిరావు, కార్యదర్శి కే వెంకటరత్నం, కోశాధికారి జీ రత్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 24 డిసెంబరు 2024

కుమైత్ చెరలోని మహిళకు విముక్తి

ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేక చొరవ

27న ఇండియాకు రావడానికి టికెట్ రెడీ

తిరుపతి, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): కువైత్‌లోని ఏజెంట్ చెరలో చిక్కుకున్న మన జిల్లా మహిళకు ఎట్టకేలకు విముక్తి లభించనుంది. ఈనెల 27న ఆమె తిరుపతికి రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని ఆమెకు విమాన టికెట్ సిద్ధం చేశారు. బిడ్డలను చదివించుకోవాలని కష్టపడి కువైత్‌కు వెళ్లి నరకకూపంలో చిక్కుకున్న శ్రీకాళహస్తి మండలం రాజీవ్ నగర్‌కు చెందిన యల్లంపల్లి లక్ష్మి ఆవేదనను సోమవారం 'నన్ను చంపి ఎడారిలో పడేస్తామంటున్నారు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. ఈ కథనంపై ఎస్పీ సుబ్బరాయుడు స్పందించారు. దుబాయ్‌లో ఉన్న తిరుపతికి చెందిన ఏపీఎన్ఆర్టీ మాజీ కోఆర్డినేటర్ డాక్టర్ ముక్కు తులసీకుమార్‌తో ఫోన్లో సంప్రదించారు. ఆమెను తిరుపతికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ గిరిధర్‌కు ఆదేశాలిచ్చారు. దీంతో డీఎస్పీ రంగంలోకి దిగి ఆమెను కువైత్‌కు పంపిన పీలేరు ఏజెంట్ శ్రీనివాస్‌తో మాట్లాడారు. ఆయన ద్వారా కువైత్‌లోని ఏజెంట్‌తో మాట్లాడి టికెట్ పంపారు.

అప్రమత్తంగా ఉండాలి



ఉపాధికోసం విదేశాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి. ఏజెంట్లను గుడ్డిగా నమ్మి మోసపోవద్దు. వెళ్లే ముందు మీ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌కు పూర్తి వివరాలు ఇవ్వండి. ఏ దేశానికి, ఎవరిద్వారా, ఎలాంటి పనికి వెళుతున్నారనే సమాచారం ఉండాలి. తద్వారా భవిష్యత్తులో అక్కడేమైనా ఇబ్బందులు తలెత్తితే సులభంగా పరిష్కరించవచ్చు. మోసం చేసే ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- ఎస్పీ సుబ్బరాయుడు

పాస్‌పోర్ట్ కోసం ప్రయత్నిస్తున్నాం



కువైత్‌లో శ్రీకాళహస్తి మహిళ లక్ష్మి విముక్తి కోసం తిరుపతి పోలీస్ అధికారులు చూపిన చొరవ అభినందనీయం. పోలీస్ అధికారులు నాతో ఫోన్లో మాట్లాడారు. ఇక్కడి ఏజెంట్ ద్వారా టికెట్ పంపారు. ఇంకా ఆమె చేతికి పాస్‌పోర్టు రాలేదు. రెండు రోజుల్లో పాస్‌పోర్ట్ ఆమెకు అందేలా ప్రయత్నిస్తున్నాం.

- డాక్టర్ ముక్కు తులసీకుమార్,
ఏపీఎన్ఆర్టీ మాజీ కోఆర్డినేటర్

కలెక్టరేట్‌లో ముందస్తు క్రిస్మస్


చిన్నారుల చేత కేక్ కట్ చేయిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రేమ, కరుణ, త్యాగానికి ప్రతీక క్రిస్మస్ అని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. క్రైస్తవులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. తాను మిషనరీ స్కూల్ చదువుకున్నానని గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టియన్, మైనార్టీ సంక్షేమానికి అమలు చేస్తున్న అనేక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారుల చేత ఆయన క్రిస్మస్ కేక్‌ను కట్ చేయించారు. పాస్టర్ బైబిల్‌ను కలెక్టర్‌కు బహూకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డీఆర్వో నరసింహులు, హరినాథ్‌రెడ్డి, చర్చి పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు. - తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

అమ్మో.. ఇనుప పెట్టె

కాళంగి నది ఒడ్డున కలవరం ● వరదల్లో కొట్టుకొచ్చినట్లుగా అనుమానం



తడ మండలం చేనిగుంట వద్ద కాళంగినది ఒడ్డున ఇనుప పెట్టె కలకలం రేపింది. సోమవారం తెల్లవారుజామున పొలాలకు వెళ్లే రైతులు ఇనుప పెట్టెను గుర్తించి కలవరపడ్డారు. చుట్టుపక్కల గ్రామస్తులను పిలిచి పరిశీలించారు. బరువైన ఇనుప పెట్టె కావడం, మూత నేలవైపు ఉండటంతో పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పలుగు, పారలతో అతి కష్టంమీద మూతను తెరిపించారు. అందులో నీళ్లు మాత్రమే ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. పదిరోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఇనుప పెట్టె కొట్టుకువచ్చి ఉంటుందని, రైల్వేకు సంబంధించిన పెట్టెగా భావిస్తున్నామని పోలీసులు తెలిపారు.

- తడ, ఆంధ్రజ్యోతి

నవోదయం-2

వచ్చే నెలలో ప్రారంభం

● నాటుసారా తయారీ, విక్రయాలపై ప్రభుత్వం ఉక్కుపాదం

● కార్యాచరణ సిద్ధంచేస్తున్న జిల్లా అధికారులు

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు.. 2016లో 'నవోదయం' తీసుకొచ్చింది. జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలను అరికట్టడానికి చర్యలు చేపట్టింది. అప్పట్లో ఈ చర్యలు సత్ఫలితాలిచ్చాయి కూడా. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మద్యం రేట్లను భారీగా పెంచడంతో.. నాటు సారా తెరపైకి వచ్చింది. జిల్లాలో విచ్చలవిడిగా తయారీ, అమ్మకాలు సాగాయి. వీటిని అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం మళ్లీ నవోదయాన్ని అమలు చేయనుంది. వచ్చే నెలలో 'నవోదయం-2' ప్రారంభం కానుంది.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి


నారాయణవనం మండలంలో నాటు సారా ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నవోదయం పథకాన్ని రాష్ట్రంలో మళ్లీ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి సోమవారం ఎక్సైజ్ కమిషనరు, డైరెక్టర్లు జిల్లా స్థాయి అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. కాగా, జిల్లాలో నవోదయం-2 పథకాన్ని అమలు చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత శాఖ అధికారులతో సమావేశమై రానున్న మూడు నెలల్లో సారారహిత జిల్లాగా తయారు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో జిల్లాలోని 12 ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో ఎక్కడెక్కడ నాటు సారా తయారీ.. విక్రయాలు జరుగుతున్నాయనే దానిపై వివరాలు సేకరిస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో పుత్తూరు, నాగలాపురం, చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎక్సైజ్ సర్కిళ్ళ పరిధిలోని బాగా వెనుకబడిన ప్రాంతాల్లో నాటుసారా తయారీ ఎక్కువగా ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. చంద్రగిరి మండలం ఎర్రావారిపాలెం, ఏర్పేడు మండలం బత్తినయ్యకాలనీ, కేవీబీ పురం మండలం, నారాయణవనం, నాగలాపురం, పిచ్చాటూరు, పుత్తూరు మండలాల్లోని పలు ప్రాంతాల్లో నాటు సారా తయారు చేస్తున్నారు. మొత్తమ్మీద ఏడు మండలాల పరిధిలోని 18 గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు ఉన్నట్లు గుర్తించారు. కేసులు, పీడీ చట్టాలకు బెదరక.. జైలుకు వెళ్లొచ్చాక కూడా సారా తయారీ, అమ్మకాల వైపు మొగ్గుచూపుతున్నారు. మారుమూల అటవీ ప్రాంతాల్లో నాటుసారా తయారు చేసి వాహనాల ట్యూబుల్లో నింపి విక్రయిస్తున్నారు.

పునరావాసంపై అధికారుల దృష్టి

నాటుసారా తయారీని పూర్తిగా అరికట్టాలనే ఆశయంతో ప్రభుత్వం మళ్లీ నవోదయం తీసుకొస్తోంది. దీనిని వ్యాపకంగా పెట్టుకున్న దాదాపు 430 మందిని అధికారులు గుర్తించారు. వీరికి బ్యాంకు రుణాలు అందించడం, ఆవులు కొనివ్వడం.. మహిళలైతే డ్వాక్రా గ్రూపుల్లో చేర్పించి బుట్టలు అల్లడం, సాంబ్రాని వత్తుల తయారీని నేర్పడం, టైలరింగ్, ఇలా స్థానికంగా వున్న డిమాండును బట్టి స్వయం ఉపాధి పథకాలు అందించనున్నారు. తయారీదారులకు కౌన్సిలింగ్ ఇవ్వనున్నారు. అలాగే, ఆయా గ్రామాల్లో గ్రామసభలు పెట్టి ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. సారా వల్ల కలిగే నష్టాలను వివరించి వారిలో మానసిక పరివర్తన తెచ్చేందుకు ప్రయత్నించనున్నారు.

● ఫటా ఫట్ ?

టార్గెట్.. మూడు నెలలు

● సారారహిత జిల్లాగా తిరుపతి

● జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి



మూడు నెలలు.. సారారహిత జిల్లాగా తిరుపతిని మార్చడానికి అధికారులు పెట్టుకున్న లక్ష్యమిది. ఈ దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి చెప్పారు. మద్యం బెల్టు షాపులపైనా ఎలాంటి చర్యలు చేపడతామనే దానిపై ఆయన స్పందించారు.

ప్రశ్న: నాటుసారా కట్టడికి తీసుకుంటున్న చర్యలు

జవాబు: తిరుపతి డివిజన్‌లో దాదాపు ఏడు మండలాల పరిధిలోని 17 గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు జరుగుతున్నాయి. అందులో ప్రధానంగా ఎర్రావారిపాళెం, ఏర్పేడు, కేవీబీ పురం, నాగలాపురం, పిచ్చాటూరు మండలాల పరిధిలోని 50 శాతం గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఉపాధిగా నాటుసారా తయారు చేస్తున్నారు. వీరికి ఉపాధి కల్పించి నాటుసారా తయారీ, అమ్మకాలు నిషేధించడానికి కలెక్టర్ ఒక పథకం రూపొందిస్తున్నారు. తద్వారా రానున్న మూడు నెలల్లో సారారహిత జిల్లాగా మార్చనున్నాం.

ప్రశ్న: బెల్టుషాపుల కట్టడి ఎలా

జవాబు: బెల్టుషాపులపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. రెండు నెలల వ్యవధిలో 184 కేసులు.. 506 లీటర్ల మద్యం, 13 లీటర్ల బీరు సీజ్ చేశాం. 184 మందిని అరెస్ట్ చేశాం. ఇది నిరంతర ప్రక్రియ. రూ.99 మద్యాన్ని ఇంకా అధిక సంఖ్యలో మద్యం దుకాణాల్లో ఉంచి బెల్టుషాపులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: నూతన సంవత్సరం, సంక్రాంతికి ఈవెంట్ పర్మిట్ల పరిస్థితిపై

జవాబు: నూతన సంవత్సరానికి ఈవెంట్ పర్మిట్ల కోసం చాలామంది ముందుకొస్తారు. వారు దరఖాస్తు చేసిన ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ఈవెంట్ పర్మిట్‌కు అనుకూలంగా ఉంటే అనుమతులు ఇస్తాం. దీని కోసం రోజుకు రూ.5200 ప్రభుత్వానికి చెల్లించాలి. ఎన్ని పర్మిట్లు అవసరమైనా నిబంధనల మేరకు పరిశీలించి మంజూరు చేస్తాం. దీనివల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, గొడవలు జరగకుండా పోలీసుశాఖ ముందస్తు చర్యలు తీసుకుంటుంది.

ప్రశ్న: సిబ్బంది కొరత ఉందా

జవాబు: జిల్లాలో 12 సర్కిళ్లలో ప్రస్తుతం 16 మంది సీఐలు పని చేస్తున్నారు. 28 మంది ఎస్ఐలకుగాను 21 మంది ఉన్నారు. జిల్లాకు మరోవంద మంది కానిస్టేబుళ్లు కావాల్సి ఉంది.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

17 కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరు నిందితుల అరెస్ట్


గంజాయిని, నిందితులను చూపుతున్న సీఐ

పుత్తూరు అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పలాస నుంచి చెన్నైకి 17 కిలోల గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులు సోమవారం పోలీసులకు పట్టుబడ్డారు. ఒక్కో బండిల్‌లో 2 కిలోల చొప్పున 8 బండిళ్లు, మరో కిలో బండిల్.. మొత్తం 9 బండిళ్లలో రూ.2.55 లక్షల గంజాయి పట్టుకున్నారు. పుత్తూరు సీఐ సురేంద్రనాయుడు తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా ఇరులపాల్యం గ్రామానికి చెందిన ఎం.ప్రభాకరన్ అమెజాన్, బిగ్ బాస్కెట్ వంటి ఆన్‌లైన్ పార్శిళ్లను లోడ్ చేసేవాడు. తోటి కూలీలతో కలిసి గంజాయికి అలవాటుపడ్డాడు. పార్శిళ్ల వాహన యజమాని సురేష్ ద్వారా డ్రైవింగ్ నేర్చుకున్నాడు. ఈక్రమంలో మొగిలన్ పరిచయమయ్యాడు. అతడి ద్వారా మనిమేగలై అనే మహిళతో కలిసి ఈనెల 18వ తేదీన రైలులో పలాసకు వెళ్లారు. అక్కడి రైల్వేస్టేషన్ వద్ద ఇద్దరి నుంచి గంజాయి బండిళ్లు తీసుకున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా రైళ్లు మారుతూ రేణిగుంటకు చేరుకున్నారు. రేణిగుంటనుంచి బస్సులో చెన్నైకి బయలుదేరారు. పుత్తూరు పున్నమి కూడలి వద్ద వాహన తనిఖీల్లో గంజాయి బండిళ్లు ఉన్న ట్టు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుళ్లు రవి, టీఎం రామమూర్తి, ఏకాంబరం, బాలకృష్ణ, కె.యమునను సీఐ అభినందించారు.

'మత్తు'లో యువకుల వీరంగం

● ఆర్టీసీ కండక్టర్‌కు రాయి తగలడంతో నిలదీత

● ఆగ్రహంతో ఆయనపై దాడి

చంద్రగిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో కొందరు యువకుల దాడిలో ఆర్టీసీ కండక్టర్ గాయపడ్డారు. పోలీసులకు బాధితుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. చంద్రగిరి పంచాయతీ భారతినగర్‌కు చెందిన సుధాకర్ కుప్పం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి డ్యూటీ అయ్యాక 11.30 గంటల సమయంలో బస్సు దిగి ఇంటికి నడుచుకొంటూ వస్తున్నారు. అదే సమయంలో ఆర్ఎఫ్ రోడ్డులో కొంతమంది యువకులు మద్యం లేదా గంజాయి మత్తులో గొడవపడుతూ.. రాళ్లు విసురుకొన్నారు. అందులో ఒక రాయి సుధాకర్‌కి తగిలింది. దీనిపై ఆయన ప్రశ్నించగా.. ఆ యువకులు ఆగ్రహంతో దాడిచేసి గాయపరిచారు. ఈలోగా స్థానికులు వచ్చేసరికి వారు పరారయ్యారు. అపస్మారక స్థితికి చేరుకున్న సుధాకర్‌ను తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ ఫుటేజ్ ఆధారంగా ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

గాలేరు-నగరి ఈఈ సస్పెన్షన్

● ఆదాల కంపెనీకి అక్రమంగా బ్యాంకు గ్యారెంటీ వాపస్ ఫలితం

శాఖాపరమైన విచారణకు ఆదేశం ● తాజాగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

తిరుపతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుకు సంబంధించి తిరుపతి ఎఫ్ఏసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)గా వ్యవహరిస్తున్న సీహెచ్ హరిబాబును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. నెల్లూరు జిల్లా వైసీపీ నేత ఆదాల ప్రభాకర్‌రెడ్డికి చెందిన నిర్మాణ కంపెనీకి.. నిబంధనలు ఉల్లంఘించి బ్యాంకు గ్యారెంటీ విడుదల చేసిన కారణంగా ఆయనపై వేటుపడింది. ఈ పథకం కింద కడప జిల్లా నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కాలువ తవ్వాల్సి ఉంది. శేషాచల పర్వతాలు అడ్డుగా ఉన్నందున టన్నెల్ కూడా తవ్వాలి. ఈ పనుల ఇన్వెస్టిగేషన్, డిజైన్లతో పాటు మెయిన్ కెనాల్ 245వ కిలోమీటరు నుంచి 262.100 కిమీ వరకు కాలువ తవ్వకం.. అలాగే 262.100 కిమీ నుంచి 272.800 కిమీ వరకూ బాలాజీ టన్నెల్-2 తవ్వకం, లైనింగ్ పనులకు 2007-08లో నాటి ప్రభుత్వం జలయజ్ఞం కింద టెండర్లు పిలిచింది. ఆదాల ప్రభాకర్‌రెడ్డికి చెందిన మెస్సర్స్ ఏపీఆర్‌సీఎల్-సీఆర్ఎస్ఎస్‌జీ (జేవీ) హైదరాబాద్ కంపెనీకి టెండర్లు ఖరారయ్యాయి. ప్రభుత్వం ఆ కంపెనీకి మొబిలైజేషన్ అడ్వాన్సు కూడా చెల్లించింది. ఆ పనులకు సంబంధించి ఆ కంపెనీ రూ.1.36 కోట్లు బ్యాంకు గ్యారెంటీ ఇచ్చింది. ఎంతకాలమైనా పనులు చేపట్టలేదు. దీంతో ఇంజనీరింగ్ అధికారులు కంపెనీకి నోటీసులు జారీ చేశారు. అడ్వాన్సు తీసుకుని కూడా పనులు చేపట్టనందున తీసుకున్న అడ్వాన్సు మొత్తాన్ని ప్రభుత్వానికి వాపస్ చేయాలని నోటీసుల్లో కోరారు. దీనికి ప్రతిగా కంపెనీ ప్రతినిధులు తమకు సకాలంలో అవసరమైన అనుమతులు, ఆమోదాలు ఇవ్వలేదని, దానివల్ల పనులు చేపట్టలేకపోయామని సమాధానమిచ్చారు. మొబిలైజేషన్ అడ్వాన్సుతో మెషినరీ కొనుగోలు చేశామని, పనులు లేక వాటిని ఖాళీగా పెట్టినందున తామే నష్టపోయామని అందులో పేర్కొన్నారు. అడ్వాన్సు నిధులు పోను ప్రభుత్వమే తమకు అదనంగా సుమారు రూ.91 లక్షలు చెల్లించాలని క్లెయిమ్ చేశారు. అప్పటి నుంచి ఆ వివాదం పెండింగులో ఉంది. కరోనా సమయంలో కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన బాకీలేవైనా ఉంటే వాటికి సరిపడా మాత్రమే బ్యాంకు గ్యారెంటీలు ఉంచుకుని మిగిలిన గ్యారెంటీలను విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దానికనుగుణంగా ఆదాల కంపెనీకి కూడా గాలేరు-నగరి ప్రాజెక్టు ఎస్ఈ, ఈఈ నోటీసులిచ్చారు. అడ్వాన్సు వెనక్కి చెల్లించి బ్యాంకు గ్యారెంటీ వాపస్ తీసుకోవాలని కోరారు. ఆ అధికారులు నిబంధనల ప్రకారం నిక్కచ్చిగా వ్యవహరించడంతో 2022-23లో వారిపై బదిలీ వేటు పడింది. ఆ స్థానంలో హరిబాబును ఎఫ్ఏసీ ఈఈగా నియమించారు. ఆయన వచ్చీ రాగానే ఆదాల కంపెనీకి ప్రభుత్వమే బాకీ పడిందని పేర్కొంటూ కంపెనీకి బ్యాంకు గ్యారెంటీని రిలీజ్ చేసేశారు. ఫలితంగా ప్రభుత్వం చెల్లించిన మొబిలైజేషన్ అడ్వాన్సును ఎలా వెనక్కి రాబట్టాలో అంతుబట్టక ఇరిగేషన్ ఉన్నతాధికారులు సతమతమవుతున్నారు. ఈ వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు గ్యారెంటీలను విడుదల చేసిన హరిబాబుపై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. ఆ క్రమంలో అతడిని సస్పెండ్ చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.


ఫేషియల్ రికగ్నిషన్ బ్యారియర్ గేట్ ముందు టోకెన్ చూపుతున్న బోర్డు సభ్యులు - కియాస్క్



గంటా, రెండు గంటల్లో స్వామి దర్శనమయ్యేలా..!

ఏఐ సహకారంతో చర్యలు ● తిరుమలలో డెమో ఇచ్చిన ఓ సంస్థ

తిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాలుగైదు కిలోమీటర్ల పొడవైన క్యూలైన్లలో.. చిన్నపిల్లలు, వృద్ధులతో 20 నుంచి 30 గంటల పాటు నిరీక్షిస్తూ ఆగచాట్లు పడకుండా.. కేవలం గంట నుంచి రెండు గంటల వ్యవధిలోనే తిరుమల వెంకన్న దర్శనం చేయించేందుకు టీటీడీ ధర్మకర్తలమండలి, ఉన్నతాధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో సిబ్బందితో అవసరం లేకుండా టోకెన్ పొందడం, తిరిగి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని ప్రవేశించేందుకు 'ఫేస్ రికగ్నిషన్ ఎంట్రీ' విధానంపై సోమవారం తిరుమలలో ఓ సంస్థ డెమో ఇచ్చింది.

కియాస్క్ ద్వారా టోకెన్

తిరుపతి, తిరుమలలోని పలు కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడ కియాస్క్ యంత్రాలు ఏర్పాటు చేస్తారు. ఆ యంత్రం ముందు నిలబడితే కెమెరా ఆన్ అవుతుంది. ప్రింట్ అనే ఆప్షన్‌ను నొక్కితే ఫేస్‌ను స్కాన్ చేసి దర్శన తేది, సమయంతో కూడిన ఓ టోకెన్ ప్రింట్ వస్తుంది.

ఫేషియల్ రికగ్నిషన్ బ్యారియర్ గేట్ ద్వారా ప్రవేశం

టోకెన్ పొందిన భక్తులు తమకు కేటాయించిన సమయానికి పది నిమిషాలు అటుఇటుగా వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దకు చేరుకోవాలి. అక్కడ ఫేషియల్ రికగ్నిషన్ బ్యారియర్ గేటు ముందు నిలబడితే అక్కడ కూడా కెమెరా ద్వారా ఫేస్ రికగ్నిషన్ ప్రక్రియ జరుగుతుంది. ఓ చిన్నశబ్దం వచ్చాక భక్తుడు ముందుకు వెళ్లేలా గేట్లు ముందుకు కదులుతాయి. ఒకవేళ ఫేస్ రికగ్నిషన్ ప్రక్రియలో లోపం ఉంటే టోకెన్‌ను బ్యారియర్ గేట్‌పై ఉండే ముద్రపై పెడితే కూడా బార్‌కోడ్ స్కాన్ చేసి గేట్లు తెరుచుకుంటాయి. ఈ డెమోను చూసిన అధికారులు పలు సూచనలు చేశారు. మరికొన్ని సంస్థల డెమోను కూడా పరిశీలించనున్నారు.

శ్రీవారి సేవలో మంత్రి, న్యాయమూర్తులు



మంత్రి పార్థసారథి - జస్టిస్ భవాని సుబ్బరాయన్



జస్టిస్ కృష్ణకుమార్



జస్టిస్ అనిల్‌వర్మ



జస్టిస్ సంతోష్

తిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో..మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకుమార్, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భవాని సుబ్బరాయన్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిల్‌వర్మ, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంతోష్, ఎంపీ గురుమూర్తి ఉన్నారు. వీరికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర మంత్రి పార్థసారథి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

హుండీ ద్వారా రూ.4.12 కోట్లు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 7 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం నాటి హుండీ ఆదాయం : రూ.4.12 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 77,260

తలనీలాలు సమర్పించినవారు : 24,223







ఎగ్జైట్‌మెంట్ ఇచ్చే ఎక్జొటిక్ పార్క్!

పంచరంగుల చిలుకమ్మలు మీ భుజాలమీద వాలుతాయి. చేతి మీద నిలబడి కబుర్లు చెబుతాయి. కొండచిలువలను మెడ చుట్టూ వేసుకుని సెల్ఫీ దిగచ్చు. ఊసరవెల్లులు, విచిత్రమైన అతి పెద్ద తొండలతో ఆడుకోవచ్చు. ఎడారి ఒంటె మీద ఎక్కి చక్కర్లు కొట్టచ్చు. రంగురంగుల చేపలు ఈదులాడే ఆక్వేరియంను వీక్షించవచ్చు. తిరుపతిలో ఇటీవలే ప్రారంభించిన 'ఏటూ జెడ్ ఎక్జొటిక్ పార్క్'లో ఈ వింత విశేషాలు అందుబాటులోకి వచ్చాయి. మంగళం రోడ్డులో ఆశా కన్వెన్షన్ సెంటర్ పక్కనే ఈపార్క్ ఉంది. చిట్టిపొట్టి విచిత్ర మేకలు.. గుర్రాలు.. గినీ పిగ్స్.. అరుదైన టర్కీ కోళ్లు, అడవి కోళ్లు, కుందేళ్లు, ఉడుములు, ముంగిసలు.. ఇలా ఎన్నోరకాల ఫ్రెండ్లీ పెట్స్‌తో సందర్శకులు సన్నిహితంగా ఉండచ్చు. పెట్స్ పెంపకంలో దాదాపు ఇరవై ఏళ్ల అనుభవం ఉన్న హర్షవర్ధన్ ఒకటన్నర ఎకరాల స్థలంలో అరుదైన పక్షి, జంతుజాతులతో ఈ మినీ జూపార్క్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడ ప్రవేశ రుసుము 100 రూపాయలు.

పెట్స్‌పై ఆవగాహన కోసం

ప్రకృతికి దగ్గరగా ఉన్న అనుభూతిని కలిగించేందుకు ఈ పార్క్ ఏర్పాటు చేశాం. విద్యార్థులకు పక్షి, జంతుజాతుల గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఇక్కడ ఉన్న కొన్ని పక్షులను కొనుగోలు చేశాం. ఎక్కువగా దత్తత వచ్చినవే ఉన్నాయి. ఒంటెను నెల్లూరు దగ్గర కాపాడి తీసుకొచ్చాం. ఎవరైనా పెంచుకోవాలని అనుకుంటే బ్రీడ్ అయిన జాతులను ఉచితంగా ఇవ్వాలనుకుంటున్నాం. జనవరి నుంచి దత్తత ఇవ్వడం ప్రారంభిస్తాం.

- హర్షవర్ధన్, ఎక్జొటిక్ పార్క్ నిర్వాహకుడు

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుమలేశుని సేవలో భండారకేరి మఠాధిపతి

తిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉడిపిలోని భండారకేరి మఠాధిపతి విద్యేశతీర్థ స్వామి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో శిష్యబృందంతో ఆలయం మహద్వారం వద్దకు చేరుకున్న స్వామిజీకి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆలయ అర్చక బృందం స్వాగతం పలికారు.

స్థానికులకు జనవరి7న దర్శనానికి 5న టోకెన్ల జారీ

తిరుమల, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): జనవరి 7న తిరుమల దర్శనానికి స్థానికులకు టోకెన్‌లను జనవరి 5న విడుదల చేయనున్నారు. టీటీడీ బోర్డులో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతినెలా మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జనవరి 5న తిరుపతి మహతి ఆడిటోరియంలో, తిరుమల బాలాజీనగర్‌లో శ్రీవారి దర్శన టికెట్లు జారీ చేయనున్నారు. తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలతో పాటు తిరుమలలోని స్థానికులు దర్శనానికి అర్హులు. ఒరిజినల్ ఆధార్‌కార్డు చూపించి టోకెన్లు పొందవచ్చు.

12న జాతీయ యువజనోత్సవం

తిరుపతి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వివేకానంద జయంతి సందర్భంగా వచ్చే నెల 12వ తేదీన జాతీయ యువజనోత్సవం నిర్వహిస్తున్నట్లు సెట్విన్ ఇన్‌చార్జ్ సీఈవో మోహన్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మొదటి వారంలో యువతీయువకులకు పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 16 నుంచి 29 సంవత్సరాల లోపు వారు అర్హులని తెలిపారు. వచ్చే నెల 5వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 0877-2286921, 9440573537, 7036428762లను సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● భర్త మృతి, భార్య పరిస్థితి విషమం



మృతి చెందిన బాలాజీ - గాయపడిన మాధవి

చంద్రగిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎం.కొత్తపల్లి సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్య తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం మేరకు తిరుపతి రూరల్ మండలం తిరుచానూరుకు చెందిన బాలాజీ(37), భార్యతో కలసి ద్విచక్ర వాహనంపై చిత్తూరు నుంచి తిరుచానూరు వస్తున్నారు. ఎం.కొత్తపల్లి సమీపంలోకి రాగానే చిత్తూరు నుంచి తిరుపతి వైపు వస్తున్న కారు వీరి వాహనాన్ని ఢీ కొంది. ఈప్రమాదంలో బాలాజీకి భార్య తీవ్ర గాయాలవ్వడంతోఅక్కడిక్కడే మృతి చెందాడు. భార్యను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి కూడా విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ ఉద్యోగి మృతి



చెంచునాథ్ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందాడు. శ్రీకాళహస్తి పట్టణం ఎంఎంవాడకు చెందిన చెంచునాథ్(40) అలియాస్ ఖాన్ పట్టణ శివార్లలోని రాజీవ్‌నగర్ ప్రాంతంలో పురపాలక సంఘం ద్వారా నీరు విడుదల చేసే విభాగంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తుండేవాడు. సోమవారం సాయంత్రం రాజీవ్‌నగర్ వాటర్ ప్లాంట్ వద్ద విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో రాజీవ్‌నగర్ సమీపంలోని పిచ్చాటూరు రహదారిపై ఆటో ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన చెంచునాథ్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

శ్రీవారి సేవకుడితో ఉద్యోగి బూతుల దండకం

తిరుమల, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సన్నిధిలో ఒక ఉద్యోగి బూతులు మాట్లాడుతూ తనతో దురుసుగా ప్రవర్తించాడని శ్రీవారి సేవకు వచ్చిన ఒక భక్తుడు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం వేకువజామున సేవ పూర్తిచేసుకుని శ్రీవారిని దర్శించుకుని వెలుపలకు వస్తున్నపుడు పంచె కాళ్లకు తగలడంతో తను కిందకు వంగానని, అక్కడే విధులు నిర్వహిస్తున్న టీటీడీ ఉద్యోగి ఒకరు చెప్పుకోలేని పదాలతో బూతులు తిట్టాడని గుంతకల్‌కి చెందిన టీవీ లోకనాథం ఆరోపించారు. పవిత్రమైన స్వామి సన్నిధిలో ఇలా బూతులు మాట్లాడటమేమిటని ఆవేదన వ్యక్తం చేశారు ఈమేరకు ఆయన సేవా విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించిన అనంతరం ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. కాగా టీటీడీ ఉద్యోగులు శ్రీవారిసేవకులను చులకనగా మాట్లాడుతున్నారంటూ డయల్‌యువర్ ఈవో కార్యక్రమంలో కూడా గతంలో కొందరు ఆవేదన వ్యక్తం చేశారు.


వైసీపీ నేతల పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి(జీవకోన), డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): కరెంటు చార్జీలు పెంచేశారంటూ వైసీపీ చేపట్టిన పోరుబాట పోస్టర్‌ను సోమవారం తిరుపతిలో ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. పెరిగిన విద్యుత్తు చార్జీలపై ఈనెల 27వ తేదీ ఆయా విద్యుత్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. ఇందుకోసం ప్రజలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ శిరీష, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయరెడ్డి, నాయకులు అజయ్‌కుమార్, ఆంజనేయులు, నల్లనిబాబు, ఇమ్రాన్, అనిల్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో బాధ్యతల స్వీకరణ

తిరుపతి(వైద్యం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ బాలకృష్ణ నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నగరి ఏరియా ఆస్పత్రిలో సీఎస్ఆర్ఎంవోగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ నాయక్‌ను ప్రభుత్వం డీఎంహెచ్‌వోగా నియమిస్తూ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ మేరకు ఆయన సోమవారం తిరుపతిలోని డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు వైద్యులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనుల పరిశీలన



వాటర్ ట్రీట్‌మెంట్ ట్యాంక్‌పై చర్చిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేరసానిపల్లె పంచాయతీ గుండ్లగుట్టపల్లె వద్ద నిర్మిస్తున్న వాటర్ ట్రీట్ మెంట్ ట్యాంక్‌ను చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం సందర్శించారు. అడవిపల్లె రిజర్వాయర్ నుంచి గుండ్లగుట్టపల్లె వాటర్ ట్రీట్‌మెంట్ ట్యాంక్‌కు నీరు చేరుతుంది. ట్యాంకులో నీటిని శుద్ధి చేశాక పైపులైన్ ద్వారా చిత్తూరు ఎన్టీఆర్ జలాశయానికి పంపడానికి పనులు చేపట్టారు. ఐదేళ్లగా పాలకులు, అధికారులు నిర్లక్ష్య వైఖరితో పనులు నిలిచిపోయినట్లు గుర్తించారు. ట్రీట్‌మెంట్ ట్యాంక్‌కు స్థలం ఇచ్చిన రైతులకు మరింత నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి టెండర్ల ద్వారా పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్టీఆర్ జలాశయానికి పంపే నీటిలో ఎమ్మెల్యే అభ్యర్థిన మేరకు 0.2 టీఎంసీలను పాకాల మండల చెరువులకు కేటాయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ట్యాంకుపనులపై చర్చించారు. ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర ప్రసాద్, డీఈ రెడ్డి సురేష్, చిత్తూరు పబ్లిక్ హెల్త్ డీఈ నాయక్, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ - ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, వారి సమస్యలు వింటున్న అధికారులు

పీజీఆర్ఎస్‌కు 243 వినతులు

కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 243 వినతులు వచ్చాయి. అందులో భూ సమస్యలపై అత్యధికంగా రెవెన్యూ శాఖకు 153 ఉన్నాయి. కాగా, పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ పలు కీలక మార్పులు చేశారు. గతంలో టోకెన్ కలిగిన అర్జీదారుడు పీజీఆర్ఎస్ వేదిక వద్దకు వెళ్లి కలెక్టర్‌కు లేదా జేసీకి, ఇతర అధికారులకు అర్జీలు అందజేసేవారు. అయితే ప్రతి అర్జీదారుడి సమస్యను సావధానంగా తెలుసుకునేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. అన్ని శాఖల హెచ్‌ఓడీలను కౌంటర్ల వద్ద కూర్చోబెట్టి అర్జీదారుల సమస్యలు వినే విధంగా చర్యలు తీసుకున్నారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ సదస్సులు, సీఎంవో, ఆన్‌లైన్‌లో ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీకీ బాధ్యతాయుతంగా పరిష్కారం చూపాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌పై జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, మండల అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. రెవెన్యూ సదస్సుల్లో ఎక్కువగా భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని పారదర్శకంగా పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం ఉపసంహరించుకోవాలి

● కేంద్ర ప్రభుత్వానికి రైతు సంఘాల అల్టిమేటం ● కేంద్ర ప్రభుత్వ జీవోను దగ్ధం చేసిన నేతలు ● పోలీసులు, నేతల మధ్య వాగ్వాదం



జీవో ప్రతులను దహనం చేయగా.. మంటలు ఆర్పుతున్న పోలీసు కానిస్టేబుల్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ వ్యవసాయ మార్కెట్(ప్రైవేటీకరణ) విధానం ఉపసంహరించుకోవాలని, దీనిపై పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేత ధోరణి విడనాడాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతు సంఘాల పిలుపు మేరకు వ్యవసాయ మార్కెట్ ప్రైవేటీకరణ కోసం తీసుకువచ్చిన జీవోను సోమవారం కలెక్టరేట్ వద్ద రైతు సంఘాల నేతలు దగ్ధం చేశారు. పోలీసులు ఆపేందుకు ప్రయత్నించడంతో తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు, నిరసనకారుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య సలహాదారుడు (సీబీఎఫ్ఏ) మాంగాటి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలన్నారు. మూడు నల్ల చట్టాలు రద్దు చేస్తానని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ దొడ్డిదారిన జాతీయ మార్కెట్ విధానాన్ని తీసుకువచ్చి రైతులను మోసం చేశారని దుయ్యబట్టారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి రామిశెట్టి వెంకయ్య మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర ఇవ్వాలని ఢిల్లీ సరిహద్దులో పోరాటం చేస్తున్న వారిని అణిచివేయాలని చూస్తే సహించమన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ అన్నం పెట్టే రైతన్నలతో కంటనీరు పెట్టించడం సరి కాదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా పోరాటం చేస్తున్న వారిపై కేసులు పెట్టి, జైల్లో వేయడం దుర్మార్గపు చర్య అన్నారు. అనంతరం జేసీ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు జల్లా విశ్వనాథ్, ప్రజా సంఘాల నాయకులు పాటూరి వెంకటరత్నం, శివారెడ్డి, బండి చలపతి, ప్రవీణ్, శివ, మణి, పద్మనాభం, అల్లాబాషా, మునీశ్వర్, చందు నాయక్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన వినాయకనగర్ క్వార్టర్స్‌లో సోమవారం చోటు చేసుకుంది. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా కలికిరికి చెందిన పీ గణేష్, కేవీపల్లికి చెందిన కే పార్వతమ్మ(27) మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. గణేష్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. పార్వతమ్మ టీటీడీ పరిధిలోని పద్మావతి హృదయాలయ ఆస్పత్రిలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుగా పనిచేస్తోంది. పుట్టింటి నుంచి డబ్బు తీసుకురావాలంటూ కొన్ని రోజులుగా గణేష్ పార్వతమ్మపై ఒత్తిడి తేవడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై ఇద్దరూ తరచూ గొడవ పడుతున్నారు. ఆదివారం గొడవ తారస్థాయికి చేరడంతో ఘర్షణపడ్డారు. మనస్తాపానికి గురైన పార్వతమ్మ అందరూ నిద్రించిన తర్వాత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అలిపిరి పోలీసులు పార్వతమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ నాగార్జున రెడ్డి నిందితుడు గణేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,716మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,703మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 1,951మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 720, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 259మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 230మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 86మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,879 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ మైదానం పరిశీలన



పక్షుల పండుగ జరిగే మైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నేతలు సుధాకర్ రెడ్డి, రమేష్, మాధవ నాయుడు, కిషోర్

సూళ్లూరుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించే జూనియర్ కళాశాల మైదానాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సోమవారం టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా పక్షుల పండుగను నిర్వహించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పక్షుల పండుగ జరిగే మైదానాన్ని చదును చేయడంతో పాటు మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించేలా చర్యలు తీసుకొంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు, బండారు ఆంజనేయులు, మేడా సాయి నారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి దారేదీ?



వరి పొలాల మీదుగా మృతదేహాన్ని మోసుకెళ్తున్న కానూరు గ్రామస్తులు

పెళ్లకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితంలో ఆఖరి మజిలీ అయిన అంత్యక్రియలను నిర్వహించలేని దుస్థితి పెళ్లకూరు మండలం కానూరులో నెలకొంది. గ్రామానికి చెందిన వెంపళ్ల పెంచలమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లేందుకు దారిలేకపోవడంతో ఒకటిన్నర కిలోమీటరు దూరం పొలాలు, కంపచెట్లలో నడుచుకుంటూ మోసుకెళ్లాల్సి వచ్చిందని గ్రామస్తులు వాపోయారు. శ్మశానానికి దారిచూపాలని అనేకసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిమెంట్ రోడ్డు పనుల అడ్డగింత

పోలీసులకు ఫిర్యాదు

కోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రుద్రవరంలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం కొంతమంది అడ్డుకోవడంతో టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక అరుంధతీయ వాడలో రూ.5 లక్షల ఉపాధి నిధులతో సిమెంట్ రోడ్డు పనులను చేస్తున్నారు. అయితే సోమవారం కొంతమంది రోడ్డు పనులను అడ్డుకోవడంతో వివాదం నెలకొంది. స్థానిక టీడీపీ నాయకుడు యల్లశిరి కృష్ణయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పవన్‌కుమార్ రుద్రవరం వెళ్లి ఇరువర్గాలను విచారించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కోట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోటలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. తహసీల్దారు జయ జయరావు, ఎంపీడీవో వేణు వారివారి కార్యాలయాల్లో అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించగా, కొన్నింటిని సంబంధిత శాఖల అధికారులకు పంపారు.

రెవెన్యూ సదస్సు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలవలపూడి, కుమ్మరిపేట, ఉప్పరపల్లి, విద్యుత్ కుమార యాచసముద్రంలో తహసీల్దార్ రాంబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

సాగు భూములకు పట్టాలివ్వండి

డక్కిలి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకొంటున్నభూములకు పట్టాలు మంజూరు చేయాలని చాపలపల్లి, నాయుడుపాళెం గ్రామాల ప్రజలు అధికారులను కోరారు. సోమవారం మండలంలోని చాపలపల్లి, నాయుడుపాళెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, ఆర్ఐ ప్రియాంక, ఏఎస్‌వో వెంకటయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు, పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక గమళ్లపాళెంలోని నిరాశ్రయుల కేంద్రంలో వృద్ధులకు సోమవారం ఆర్యవైశ్య మహిళా సమాజం ఆధ్వర్యంలో దుస్తులు, పౌష్టికాహారం అందజేశారు. సంస్థ పట్టాణాధ్యక్షురాలు చంద్రకళ, సుప్రజ, మంజుల, సుజాత, నాగజ్యోతి, లహరి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు

దరఖాస్తు చేసుకోండి

గూడూరు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 3 అంగన్‌వాడీ కార్యకర్తలు, 4 సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీవో మెహబూబి తెలిపారు. గూడూరు పట్టణ పరిధిలోని మాళవ్యానగర్, ఆస్పత్రి రోడ్డు, చిల్లకూరు మండలంలోని తిమ్మనగారిపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, గూడూరు పట్టణంలోని ఆస్పత్రి రోడ్డు, మండలంలోని నెర్నూరు, మంగళపూరు, చిల్లకూరు మండలంలోని బల్లవోలులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హత కలిగిన వారు జనవరి 6వ తేదీలోగా దరఖాస్తులను ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

కోట ఐసీడీఎస్ పరిధిలో...

కోట(ఆంధ్రజ్యోతి): కోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో మునికుమారి కోరారు. చిట్టమూరు మండలంలోని చిట్టమూరు గ్రామంలో ఒకటి(ఓసీ), కోట మండలంలోని నెల్లూరుపల్లిలో ఒక పోస్టు (ఓసీ) ఖాళీ ఉన్నాయన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 21 నుంచి 35 సంవత్సరాల లోపు వయసున్న వారు అర్హులని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు జనవరి 8వ తేదీ లోగా కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో తెలిపారు.

వెంకటగిరి ఐసీడీఎస్ పరిధిలో...

వెంకటగిరి టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో షంషాద్ బేగం కోరారు. అంగన్‌వాడీ టీచర్లు రెండు ఆయా పోస్టులు 11 ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం: కురుగొండ్ల

వెంకటగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని టిడ్కో ఇళ్లను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. గత వైసీపీ పాలనలో అభివృద్ధి జాడే లేదన్నారు. వెంకటగిరి పట్టణంలో గత పాలకుల పాపాల వల్ల జనం ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కొటిగా చక్కదిద్దుతున్నట్లు వివరించారు. తాగునీటి పైపులైన్లు దెబ్బతినడంతో వాటిని బాగుచేసేకొనే ప్రక్రియ జరుగుతోందన్నారు. గ్రామాల్లో కూడా పరిస్థితి దారుణంగా ఉందని, ప్రతి పల్లెకు రహదారి, తాగునీరు, రవాణా తదితర మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు తదితరులు ఉన్నారు.



టిడ్కో ఇళ్ల వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

రైలు నుంచి జారిపడి గాయాలు

సూళ్లూరుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట - దొరవారిసత్రం మధ్యలో పోలిరెడ్డిపాలెం సమీపంలో సోమవారం సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ నుంచి ప్రమాదవశాత్తు జారిపడి సనోజ్ సధ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడిపై కేసు నమోదు

కోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోట సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌పై దాడిచేసిన కేసులో చంద్రయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న కిరణ్‌కుమార్‌పై చెంచయ్య రాడ్‌తో దాడిచేసి గాయపరచిన సంఘటన తెలిసిందే.

జిల్లాస్థాయి టెన్నికాయిట్ జట్టు ఎంపిక

గూడూరు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో ఈనెల 26వ తేదీన జిల్లాస్థాయి జూనియర్ టెన్నికాయిట్ జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్, కార్యదర్శి రమ్య తెలిపారు. 2006 ఏప్రిల్ 1వ తేదీ, ఆ తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే వారు పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాన్ని తీసుకురావాలన్నారు. ఎంపికైన విద్యార్థులు వచ్చే ఏడాది జనవరి 11, 12 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

వినియోగదారులు హక్కుల గురించి తెలుసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్, పక్కన రాజారెడ్డి, మునిరెడ్డి, తొప్పాని కృష్ణ, ఆషీష్‌బాబు, ప్రసాద్

నాయుడుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్ అన్నారు. సోమవారం నాయుడుపేట టీఎంఆర్ డిగ్రీ కళాశాలలో చేయూత చైల్డ్‌హోమ్, సంపూర్ణ సొసైటీ సంయుక్తంగా వినియోగదారుల వారోత్సవాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వస్తువుల కొనుగోళ్లల్లో నాణ్యత, ప్రమాణాల్లో సమస్యలు ఎదురైతే వినియోగదారుల హక్కుల చట్టం ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. ఏ వస్తువు కొనుగోలు చేసినా బిల్లులను తప్పక తీసుకోవాలని, తద్వారా ఏదైన లోపాలు ఉంటే పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టీఎంఆర్ విద్యాసంస్థల అధినేత తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి, వినియోగదారుల సంఘ అధ్యక్షుడు రాజారెడ్డి, కార్యదర్శి దాము, మునిరెడ్డి, హ్యూమన్ రైట్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆషీష్‌బాబు, చేయూత ప్రతినిధి తొప్పాని కృష్ణ, సంపూర్ణ సొసైటీ ప్రతినిధి ముప్పాళ్ల వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

పెళ్లకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భూసమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి కోరారు. పెళ్లకూరు మండలం అర్ధమాల గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గతంలో ప్రభుత్వం బీసీలకు ఎకరం చొప్పున భూములు పంపిణీ చేసిందని, అయితే అర్ధ ఎకరానికి మాత్రమే పట్టాలు ఇచ్చారని తహసీల్దార్‌కు విన్నవించారు. తాము 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఆ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా తూర్పుతోటలోని పొలలాకు వెళ్లే దారి ఆక్రమించారని, ఆక్రమణలు తొలిగించి దారి చూపాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో సర్పంచు పెంచలయ్య, ఆర్ఐ సంతోషీబాయి, వీఆర్వోలు భూదనం రమేష్, సుధాకర్, మండల సర్వేయర్ పూజిత, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు సిద్ధులయ్య నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, పునబాక పోలయ్య, నరేంద్ర యాదవ్, మునివర్ధన్‌రెడ్డి, వాటంబేటి నాగరాజు మణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి, పక్కన సర్పంచు పెంచలయ్య, ఆర్ఐ సంతోషీబాయి, సర్వేయర్ పూజిత


బాధ్యతగా పనిచేయండి: నెలవల



ప్రసాద్ నాయుడిని సత్కరిస్తున్న మాజీ ఎంపీ నెలవల, పక్కన టీడీపీ నాయకులు

నాయుడుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలతో పాటు ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికల్లో అధ్యక్షులుగా గెలుపొందిన ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సూచించారు. సోమవారం నాయుడుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడును నెలవల సుబ్రహ్మణ్యం పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు నేలవల్లి సిద్ధులయ్య నాయుడు, అక్కరపల్లి మాధవరెడ్డి, బైనా సుబ్రహ్మణ్యంరెడ్డి, కన్నలి వాసు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రమణకుమార్, పక్కన సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది

గూడూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ రమణకుమార్ అన్నారు. సోమవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ నేరాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శునకాలకు విషాహారం

సూళ్లూరుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విషాహారం తిని శునకాలు మృతి చెందిన సంఘటన సోమవారం సూళ్లూరుపేట పట్టణంలో చోటుచేసుకొంది. పట్టణంలోని సాయినగర్, పరమేశ్వ నగర్, గాండ్లవీధి ప్రాంతాల్లో దాదాపు పది కుక్కలు చనిపోయి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. గాండ్లవీధి బిడ్జి కింద మృతి చెందిన కుక్కల పక్కన విషం కలిపిన బిరియానీ ప్యాకెట్ ఉంది. బిరియానీలో విషం కలిపి కుక్కలకు పెట్టినట్లు అనుమానిస్తున్నారు. ఇటీవల పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉంది. ఈనేపథ్యంలో ఎవరైనా ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని స్థానికులు చెబుతున్నారు.

30న పంచాయతీ దుకాణాల వేలం

కోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోట పంచాయతీలోని 25 దుకాణాల లీజుకు సంబంధించి ఈనెల 30న వేలం నిర్వహించనున్నట్లు సర్పంచు వెంకటరమణమ్మ తెలిపారు. పట్టణంలోని బజారు సెంటర్, బాలికల ఉన్నత పాఠశాల, ఆర్టీసీ సెంటర్‌లో పంచాయతీకి చెందిన దుకాణాలకు డీఎల్‌పీవో, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద గాంధీనగర్‌వాసులు

గూడూరు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక దివిపాళెం పంచాయతీలో రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని గాంధీనగర్ వాసులు కోరారు. సోమవారం వారు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఏసుపాక పెంచలయ్య మాట్లాడుతూ ఇటీవల దివిపాళెం పంచాయతీకి సంబంధించి గాంధీనగర్‌లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారన్నారు. స్థానికులు పలు సదస్సులపై వినతులు అందజేయడం జరిగిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ సంబరాలు



విద్యుత్ దీపాలంకరణలో విద్యానగర్‌లోని హోలీస్పేయర్ చర్చి

కోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, గూడలి, చిట్టేడు, కొక్కుపాడు, తిన్నెలపూడి, కొత్తపట్నం, గోవిందపల్లి, షైక్రోటవర్ కాలనీ, రుద్రవరం గ్రామాల్లోని చర్చిల్లో చర్చీలు సోమవారం రాత్రి ముందస్తు క్రిస్మస్ సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

గూడూరు (ఆంధ్రజ్యోతి): స్థానిక గాయత్రి పాఠశాలలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, సోనియా, శ్రీహరి, రఫీ, శివయ్య, సుప్రజ, హరిత, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

ఏర్పేడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నసముద్రం మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు దొరస్వామి శెట్టి(82) సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మరణించారు. మంగళవారం ఉదయం 11గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు.

దేశానికి రైతే వెన్నెముక



రైతు దినోత్సవంలో విద్యార్థులు

గూడూరు, చిల్లకూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశానికి రైతన్నే వెన్నెముక అని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక పాఠశాలలో మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ జయంతి సందర్భంగా జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్నలు కష్టపడి, శ్రమించి పంటలు పండించి దేశంలో ఉన్న ప్రతి పౌరుడికీ ఆహారాన్ని అందిస్తున్నారని కొనియాడారు. విద్యార్థులు ఉద్యోగంతో పాటు వ్యవసాయం చేస్తూ దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, హరిబాబు, హరిబ్రహ్మ, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు. ● చిల్లకూరు మండలంలోని చింతవరం రేస్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులను పొలంలోకి తీసుకువెళ్లి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, కరస్పాండెంట్ బాలచెన్నయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

చిట్టమూరు, డిసెంబర్ 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని కొత్తగుంటకు చెందిన గుంజి సురేష్(30) ఈనెల 21న ఇంటి నుంచి మల్లాంకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా సోమసముద్రం సమీపంలో గుంతలమైయమైన రోడ్డులో అదుపు తప్పి కిందపడ్డాడు. సురేష్‌కు తలపై తీవ్రమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



గుంజి సురేష్ (ఫైల్‌ఫొటో)

విధిగా హెల్మెట్ ధరించండి



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ రమణ, ఎస్ఐలు సుబ్బారావు, భవాని సిబ్బంది

వెంకటగిరి టౌన్, డిసెంబరు 23,(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులందరూ విధిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని వెంకటగిరి సీఐ రమణ అన్నారు. సోమవారం పట్టణ పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారుడికి హెల్మెట్ భారం కాదని, ప్రమాద సమయంలో ప్రాణ రక్షణగా ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనంలో వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు కూడా శిక్షార్హులు అవుతారని అన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి ఎస్ఐ సుబ్బారావు, భవాని, డక్కిలి ఎస్ఐ శివశంకర్, బాలాయపల్లి ఎస్ఐ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీతో వరి విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

పెళ్లకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు వరినారు మడులు నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీతో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారిణి గొడవర్తి ప్రవీణ తెలిపారు. సోమవారం మండలంలోని పునబాక బీమవరం, టెంకాయతోపు, పెళ్లకూరు గ్రామాల రైతులకు విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, నాయకులు హరి నాయుడు, పునబాక పోలయ్య, యాగాని బెన్నీ, తాళ్ల యుగంధర్ గౌడ్, తాళ్లరెడ్డి శ్రీనివాస్, సిద్ధులయ్య నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, వీఏఏ దినేష్, సత్యం, శివ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న జాహ్నవి తిరుపతి జిల్లాలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయిలో మొదటి స్థానం సాధించింది. దీంతో రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి అభినందించారు. జాహ్నవితో పాటు జిల్లాస్థాయిలో ప్రతిభ చూపినవారిని కూడా అభినందించారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని ప్రతి విజయంలో కూడా పాలు పంచుకోవాలన్నారు.